# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 130 | పేజీలు : 08 | సోమవారం | 18-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# హీట్‌వేవ్ అలర్ట్

రానున్న 5 రోజులు నిప్పుల కొలిమే

రానున్న ఐదు రోజులు రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్న ఐఎండీ

అధిక ఎండలతో పాటు, వడగాలులు వీచే అవకాశం

పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. కాగా రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అధిక ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ 16 జిల్లాల్లో 41 నుంచి 44 మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

2



## కేంద్రానికి సంబంధం లేదు

2

- బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదన్న కిషన్ రెడ్డి
- పోక్సో కేసులో బండి భగీరథ్ అరెస్ట్
- ఇప్పటికే సరెండర్ అయ్యాడన్న కిషన్ రెడ్డి
- ఇక చర్చించాల్సిన అవసరం లేదని వెల్లడి
- రాష్ట్ర పోలీసులే చూసుకుంటారని స్పష్టీకరణ




## మళ్లీ తెరపైకి 'ఐబొమ్మ'..

2

ఫిలింఛాంబర్ ఫిర్యాదుతో కలకలం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమను మరోసారి కలవరపెడుతూ 'ఐ బొమ్మ' వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. పైరసీ వెబ్‌సైట్ల ద్వారా కొత్త సినిమాలను అక్రమంగా విడుదల చేస్తున్నారంటూ ఫిలిం ఛాంబర్ ఈరోజు (ఆదివారం) సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా 'ఐ బొమ్మ', 'బప్పం టీవీ' పేర్లతో నడుస్తున్న వెబ్‌సైట్లు తాజాగా విడుదలైన పలు సినిమాలను ఆన్‌లైన్‌లో

## దేశానికే అవమానం

- బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్
- పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్
- ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు
- నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ
- బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు'

## చివరకు దేశ విభజనకు కారణమైంది

- కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలే దేశ విభజనకు దారితీశాయి : యోగి ఆదిత్యనాథ్
- రాజ్యాంగం పూర్తిగా అమల్లోకిరాక ముందే కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు ప్రారంభించింది
- అదే చివరకు దేశ విభజనకు కారణమైంది
- భారత భవిష్యత్తు కోసం పనిచేసే రాజకీయ పార్టీ అవసరమని ఆర్ఎస్ఎస్ భావించింది
- యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు



## రింగ్ రోడ్ మూసివేత

3 నెలల పాటు ఉప్పల్ రింగ్ రోడ్ మూసివేత

ఈ ప్రాంతాల్లో వాహనాల దారి మళ్లింపు

మూడు నెలల పాటు ఉప్పల్ రింగ్ రోడ్ మూసివేత

ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల దృష్ట్యా నిర్ణయం

నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా మళ్లింపు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఉప్పల్ రింగ్ రోడ్‌ను మూడు నెలల పాటు మూసివేయనున్నారు. ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల దృష్ట్యా రేపటి నుంచి రింగ్ రోడ్ మూతపడనుంది. హైదరాబాద్ ఉప్పల్ రింగ్ రోడ్డు మీదుగా వరంగల్ వైపు వెళ్లే రహదారిని రేపటి నుంచి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్



## బంగ్లాదేశ్ కొత్త మెలిక!

ఆ ఒప్పందం జరిగితేనే భారత్‌తో బంధం..

- గంగా నది ఒప్పందంపైనే ఇరుదేశాల బంధమన్న బంగ్లా
- డిసెంబర్‌లో ముగియనున్న పాత ఒప్పందం గడువు
- పద్మా నదిపై బంగ్లాదేశ్ మెగా ప్రాజెక్టు
- తీస్తా వివాదంపై మమతా బెనర్జీపై విమర్శలు



హైదరాబాద్ పల్స్,డెస్క్

భారత్‌తో సంబంధాలు కొనసాగడం గంగా నది నీటి పంపకాల ఒప్పందంపైనే ఆధారపడి ఉంటుందంటూ బంగ్లాదేశ్ కొత్త మెలిక పెట్టింది. ఈ మేరకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త ఒప్పందం కోసం చర్చలు జరపాలని భారత్‌ను డిమాండ్ చేసింది.ప్రస్తుతం అమల్లో ఉన్న ఇండో-బంగ్లాదేశ్ గంగా నది నీటి ఒప్పందం 1996లో జరిగింది. అప్పటి ప్రధాని షేక్ హసీనా హయాంలో కుదిరిన ఈ



## బండి భగీరథ్ కేసులో హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్.. కేసు నమోదు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పోక్సో కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్టయ్యారు. అతడికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే మహిళాజడ్జి జస్టిస్ మాధవీ దేవిపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలపై చార్మినార్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి.. చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైంది. దీంతో అతడు ముందస్తు బెయిల్, అరెస్ట్ నుంచి రక్షణ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. వీటిని హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.అయితే ఈ కేసు విచారణలో బండి భగీరథ్‌కి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. జస్టిస్ మాధవీ దేవి భర్తకు బార్ కౌన్సిల్ ఛైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాలను మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవి స్వయంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది.దీని వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజలకు

## శాంతి చర్చలు..

ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు




- యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం
- 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్
- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు
- పరహారం ఇవ్వాల్సిందేనని పట్టు

## ఈసారి కొంచెం ఆలస్యం!

తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు...

- తెలంగాణలోకి జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు
- గతేడాది కన్నా 4 నుంచి 5 రోజులు ఆలస్యంగా రాక
- పలు జిల్లాల్లో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాల్పులు
- మే 26న కేరళను తాకనున్న నైరుతి పవనాలు
- నేడు కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు అవకాశం



## పంజాబ్‌పై ఘన విజయం

ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ..



# దేశానికే అవమానం

మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు.రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు.దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

# కేంద్రానికి సంబంధం లేదు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పందించారు. భగీరథ్ ఇప్పటికే సరెండర్ అయ్యాడని గుర్తుచేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

**ప్రతిపైసా కేంద్రానిదే**

మరోవైపు ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపైసా కేంద్రమే ఇస్తోందని వెల్లడించారు. అయినా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు రాష్ట్రం బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని.. వారికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

# శాంతి చర్చలు..

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది.ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది.ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

# బండి భగీరథ్ కేసులో హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్.. కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి

అపనమ్మకం ఏర్పడుతుందని హైకోర్టు రిజిస్ట్రార్ వ్యాఖ్యానించారు. మహిళా జడ్జి జస్టిస్ మాధవీ దేవిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో చేసిన విమర్శలను ఆధారాలతో సహా చార్మినార్ పోలీసులకు హైకోర్టు రిజిస్ట్రార్ అందజేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మరోవైపు బండి భగీరథ్ పోక్సో కేసులో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫొటోలు, వీడియోలు వైరల్ చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొన్ని సోషల్ మీడియా చానళ్లు.. బాధిత కుటుంబ వివరాలన బహిర్గతమయయ్యేలా.. ఫొటోలు, వీడియోలు ప్రసారం చేశాయి. ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాలిక, ఆమె కుటుంబ వివరాలు బహిర్గతం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి అందుకు సంబంధించిన యూఆర్ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్ కొత్త మెలిక!

మొదటి పేజీ తరువాయి

డీల్ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. కొత్త ఒప్పందం కుదిరే వరకు పాత ఏర్పాట్లే కొనసాగాలని బంగ్లాదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మీర్జా ఫక్రుల్ ఇస్లాం ఆలంగీర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో జరిగే నీటి ఒప్పందాలకు కాల పరిమితి ఉండొద్దని ఆలంగీర్ షరతు విధించారు. గంగా నదిని బంగ్లాదేశ్‌లో పద్మా నదిగా పిలుస్తారు. అక్కడి వ్యవసాయం, పర్యావరణం, తాగునీటి వ్యవస్థలకు ఈ నది ఎంతో కీలకం. బంగ్లాదేశ్‌లోని మూడో వంతు జనాభా జీవనోపాధి కోసం ఈ నదిపైనే ఆధారపడుతున్నారు.ఫరక్కా బ్యారేజ్ వల్ల తమకు ఎండాకాలంలో నీటి ప్రవాహం తగ్గిపోతోందని బంగ్లాదేశ్ తెలిపింది. దీనివల్ల నదుల్లో ఉప్పునీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని వాదిస్తోంది. మరోవైపు కోల్‌కతా పోర్టు రక్షణ కోసమే ఫరక్కా బ్యారేజ్ నిర్మించినట్లు భారత్ మొదటి నుంచి చెప్తోంది.ఈ ఇబ్బందులను అధిగమించే పేరిట బంగ్లాదేశ్ పద్మా నదిపై ఓ మెగా బ్యారేజ్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇది 2033 నాటికి పూర్తి చేయాలని ప్రధాని తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయించింది. ఈ బ్యారేజ్ నిర్మాణంపై భారత్‌తో సంప్రదింపులు జరపాల్సిన అవసరం లేదని బంగ్లాదేశ్ ఏకపక్షంగా నిర్ణయించింది.మరోవైపు తీస్తా నది నీటి ఒప్పందంపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరును కూడా బీఎన్‌పీ నేతలు ఇటీవల విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సువేందు అధికారి నాయకత్వంలో చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.నీటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఇరు దేశాల మధ్య ప్రత్యేక వేదికలు ఉన్నాయని భారత్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య ప్రవహించే 54 నదులపై క్రమబద్ధంగా చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సమావేశమవుతూనే ఉన్నారని స్పష్టం చేసింది.

# ఈసారి కొంచెం ఆలస్యం!

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో నైరుతి రుతుపవనాల ఆగమనం కోసం మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే రుతుపవనాల రాక 4 నుంచి 5 రోజులు ఆలస్యం కానుంది.ఈ నెల 26వ తేదీన కేరళను తాకనున్న రుతుపవనాలు, ఆ తర్వాత సాధారణంగా 4 నుంచి 7 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులు, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. ఇవి మరింత ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

కొనసాగుతున్న ఎండల తీవ్రత

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

# మళ్లీ తెరపైకి 'ఐబొమ్మ'..

మొదటి పేజీ తరువాయి

లీక్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫిలిం ఛాంబర్ అధికారికంగా ఫిర్యాదు చేయగా, సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సినిమా పరిశ్రమకు భారీ నష్టం కలిగించేలా పైరసీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సినీవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నాకు ఎలాంటి సంబంధం లేదు: రవి

ఇదిలా ఉంటే, గతంలో 'ఐ బొమ్మ' పేరుతో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరిగిన ఇమంది రవి అనే వ్యక్తి స్పందించారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన పేరును, 'ఐ బొమ్మ' బ్రాండ్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు నేరగాళ్లు కొత్త వెబ్‌సైట్‌ను సృష్టించారని ఆరోపించారు.ఇటీవల విడుదలైన పలు తెలుగు సినిమాలు ఆన్‌లైన్‌లో లీక్ కావడంతో నిర్మాతలు, దర్శకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమాలు థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లలో కనిపించడం వల్ల కలెక్షన్లపై ప్రభావం పడుతోందని సినీ పరిశ్రమ చెబుతోంది.

పోలీసుల చర్యలు..

సైబర్ క్రైమ్ పోలీసులు ప్రస్తుతం 'ఐ బొమ్మ' , 'బప్పం టీవీ' వెబ్‌సైట్ల నిర్వాహకులను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ సర్వర్లు ఎక్కడ నుంచి ఆపరేట్ అవుతున్నాయి?, వెబ్‌సైట్ల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. సినీ పరిశ్రమ ప్రతినిధులు పైరసీని అరికట్టేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు ప్రేక్షకులు కూడా థియేటర్లలో లేదా అధికారిక ఓటీటీ వేదికల్లోనే సినిమాలు చూడాలని సినీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# రింగ్ రోడ్ మూసివేత

మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ ఫిల్లర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నందున ఇప్పటికే వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట బస్సులను నల్లచెరువు కట్ట వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాప్‌కు మళ్లించారు. కారిడార్ పనుల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల్ని దారి మళ్లిస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులు మేఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ ద్వారా నాగోల్ వెళ్లి, సర్వీస్ రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకొని హైదరాబాద్ వెళ్లాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే వాహనదారులు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్క నుంచి బీరప్ప గడ్డ మీదుగా వెళ్లి ఎన్‌హెచ్-163 మీదుగా వరంగల్ వెళ్లొచ్చని సూచించింది. ఉప్పల్ భగాయత్ రహదారి ఇరుకుగా ఉన్నందున హైదరాబాద్ వచ్చే వరంగల్ బస్సులు, లారీలు పెద్ద వాహనాలను ఓఆర్ఆర్ నుంచి హయత్‌నగర్ మీదుగా హైదరాబాద్ చేరుకోవాలని, హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే వాహనదారులు ఎల్బీనగర్, హయత్‌నగర్ ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్ నుంచి వరంగల్ వెళ్లవచ్చని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది.

వాహనాలను దారి మళ్లించిన ప్రాంతాలు ఇవే :

హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు దారి మళ్లింపు

లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక నుంచి బీరప్పగడ్డ మీదుగా దారి మళ్లింపు

నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు దారి మళ్లింపు

అంబర్‌పేట్ వద్ద ఉన్న ఓఆర్ఆర్‌పై నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్లేలా దారి మళ్లింపు

పీర్జాదిగూడ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలు దారి మళ్లింపు

లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా సికింద్రాబాద్ వైపునకు వాహనాలు మళ్లింపు

నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా మళ్లింపు

# చివరకు దేశ విభజనకు కారణమైంది

మొదటి పేజీ తరువాయి

ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి రావడానికి, తొలి సాధారణ ఎన్నికలు జరగడానికి ముందే కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు ప్రారంభించిందని, అదే చివరకు దేశ విభజనకు కారణమైందని ఆరోపించారు. గోరఖ్‌పూర్ సమీపంలోని టెనువా టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన బీజేపీ జిల్లా శిక్షణ శిబిర ప్రారంభ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.అయితే, అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జనసంఘ్ జనతా పార్టీలో విలీనం అయిందని యోగి చెప్పారు. అయితే అనేక కారణాల వల్ల జనతా పార్టీ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదని చెప్పారు. 1980లో భారత జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భవించినప్పుడు జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో పార్టీకి కేవలం రెండు స్థానాలే గెలుచుకుందని గుర్తు చేశారు. అనంతరం 1986లో అయోధ్యలో శ్రీరాముడి జన్మస్థలంలో భవ్య రామ మందిర నిర్మాణానికి మద్దతు ఇవ్వాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. దేశంలో సాంస్కృతిక జాతీయతను స్థాపించడమే ఆ నిర్ణయం వెనుక లక్ష్యమని చెప్పారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తైందని యోగి అన్నారు. అయోధ్య రామాలయం కేవలం దేవాలయం మాత్రమే కాదని, అది 'రాష్ట్ర మందిరం' అని వ్యాఖ్యానించారు

# పంజాబ్‌పై ఘన విజయం

మొదటి పేజీ తరువాయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ ప్లే ఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఆదివారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్‌సీబీ 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో, ఈ సీజన్‌లో ప్లే ఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలిచింది. తొలుత బ్యాటింగ్‌లో వెంకటేశ్ అయ్యర్, విరాట్ కోహ్లీ అర్ధ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు రాణించడంతో బెంగళూరు ఖాతాలో మరో గెలుపు చేరింది. శశాంక్ సింగ్ వీరోచిత పోరాటం చేసినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు.223 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ కుమార్ ధాటికి ప్రియాన్ష్ ఆర్య (0), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (2) పెవిలియన్ చేరారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1) కూడా విఫలమవడంతో పంజాబ్ 19 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కూపర్ కనోలీ (37), సూర్యాంశ్ షెడ్గే (35), మార్కస్ స్టొయినిస్ (37) ఫర్వాలేదనిపించారు.అయితే, అసలు సంచలనం శశాంక్ సింగ్ రూపంలో వచ్చింది. కేవలం 27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 56 పరుగులు చేసిన శశాంక్, ఒకానొక దశలో పంజాబ్‌కు విజయంపై ఆశలు రేపాడు. కానీ, కీలక సమయంలో రసిఖ్ సలామ్ దార్ అతన్ని ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరికి పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 199 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఆర్‌సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో చెలరేగగా, భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు.అంతకుముందు, టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ఆర్‌సీబీ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలోనే జాకబ్ బెథెల్ (11) వికెట్ కోల్పోయినా, కెప్టెన్ విరాట్ కోహ్లీ (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్సులు), దేవదత్ పడిక్కల్ (25 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుతమైన భాగస్వామ్యంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వెంకటేశ్ అయ్యర్ అసలు సిసలు విధ్వంసం సృష్టించాడు. కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 73 పరుగులు చేశాడు. చివర్లో టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28) కూడా మెరుపులు మెరిపించడంతో ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది.

# హీట్‌వేవ్ అలర్ట్

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో నెలకొన్న గాలి విచ్ఛిన్నతితో రాష్ట్రంలో ఇవాళ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు వడగాలుల ప్రభావంతో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశంతో ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు.రాష్ట్రంలో సోమవారం 41 నుంచి 44 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ మేరకు కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్–మాల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను జారీ చేసి


# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సేవామూర్తులు

**పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి సత్యవతి దంపతులు**
**పదవి కోసం రాజకీయాలు కాదు ప్రజల కోసం జీవితాన్నే అంకితం చేసిన ఆదర్శ నాయకులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
గ్రామీణ రాజకీయాల్లో పదవులు మారుతుంటాయి. నాయకులు వస్తుంటారు, వెళ్తుంటారు. కానీ కొందరు వ్యక్తులు మాత్రం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటారు. తమ సేవా తత్వంతో, ప్రజల పట్ల ప్రేమతో, అభివృద్ధిపై అంకితభావంతో శాశ్వత స్థానం సంపాదించుకుంటారు. అలాంటి అరుదైన సేవామూర్తులు మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి సత్యవతి దంపతులు.
దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ గ్రామాభివృద్ధిని తమ లక్ష్యంగా మలుచుకున్న ఈ దంపతుల పేరు నేడు గ్రామ ప్రజల నోట గౌరవంగా వినిపిస్తోంది.పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కి రాజకీయాలు అధికారం కోసం కాదు... ప్రజలకు సేవ చేసే బాధ్యత. పేదవాడి కన్నీరు తుడవడానికి ఒక మార్గం. రైతు కష్టాన్ని తగ్గించడానికి ఒక బాధ్యత. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఒక సేవా యజ్ఞం. ఈ ఆలోచనలతోనే ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగింది.

**ఆదర్శ దంపతుల సేవా ప్రస్థానం :**
పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి సేవా ప్రయాణంలో ఆయన సతీమణి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి సత్యవతి పాత్ర ఎంతో విశిష్టమైనది. భర్త చేసే ప్రతి మంచి పనిలో ఆమె అండగా నిలిచారు. గ్రామ ప్రజల సమస్యలను తమ కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ఇద్దరూ నిరంతరం కృషి చేశారు.పదవిలో ఉన్నప్పుడు మాత్రమే కాదు... పదవి లేని సమయంలో కూడా ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఈ దంపతుల ప్రత్యేకతగా నిలిచింది. గ్రామ ప్రజలు కూడా "వాళ్లు పదవిలో ఉన్నప్పుడు మాత్రమే కాదు... ఎప్పుడూ ప్రజల మనుషులే" అని చెప్పుకుంటుంటారు.

**స్వంత సంపాదనతో గ్రామాభివృద్ధి**
ఈ రోజుల్లో రాజకీయాల్లోకి చాలా మంది సంపాదించడానికి వస్తారనే విమర్శలు వినిపిస్తుంటాయి. కానీ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మాత్రం సంపాదించిన దాన్ని ప్రజల కోసమే ఖర్చు చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. గ్రామంలో ఎక్కడైనా అవసరం వచ్చినప్పుడు రోడ్డు మరమ్మతులు, తాగునీటి సమస్యలు, పేదలకు అత్యవసర సహాయం, రైతులకు ఆర్థిక సహకారం వంటి అంశాల్లో ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడకుండా తన సొంత ఖర్చులతో ముందుకు వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి.



"ప్రజల పని ముందుగా జరగాలి" అనే ఆలోచనతో తన జేబు నుంచి ఖర్చు చేసి పనులు చేయించడం ఆయన ప్రత్యేకతగా ప్రజలు పేర్కొంటున్నారు. అందుకే ఆయనను ప్రజలు కేవలం నాయకుడిగా కాకుండా పెద్ద మనసున్న వ్యక్తిగా గౌరవిస్తారు.

**రైతు పక్షాన నిలిచిన నాయకుడు**
రైతు అంటే పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి కి అపారమైన మమకారం. రైతుల సమస్యలు తన సమస్యలుగా భావించి సాగునీటి సమస్యలు, పంట నష్టాలు, మార్కెట్ ఇబ్బందులు, రుణభారం వంటి అంశాలపై అధికారులను కలసి పరిష్కారాల కోసం కృషి చేశారు."రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది" అనే ఆలోచనతో ఆయన పని చేశారని రైతులు చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. ఆర్గానిక్ పంటల ప్రయోజనాలను అధికారుల ద్వారా ప్రజలకు తెలియజేయడంలో ప్రత్యేక చొరవ చూపారు.

**ప్రజల మనిషిగా గుర్తింపు**
నాయకుడు అంటే ప్రజలకు దూరంగా ఉండేవాడు కాదు... ప్రజల మధ్యే ఉండేవాడు కావాలని పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి నిరూపించారు. ఎవరైనా సమస్యతో వచ్చినప్పుడు "ఇది నా పని కాదు" అని ఎప్పుడూ అనలేదు. పేదవాడైనా, రైతైనా, కూలీ అయినా అందరికీ సమాన గౌరవం ఇచ్చారు. అందుకే గ్రామ ప్రజలు ప్రేమగా "మా వెంకటేశ్వర్ అన్న" అని పిలుచుకుంటుంటారు.

**పదవులు మారినా సేవ ఆగలేదు**
ఉపసర్పంచ్‌గా పనిచేసినా, పదవి లేకున్నా ప్రజా సేవలో మాత్రం మార్పు రాలేదు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ అధికారులను కలవడం, గ్రామ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం, అభివృద్ధి పనుల కోసం కృషి చేయడం ఆయన నిత్యకర్తవ్యంగా భావించారు.పదవులు శాశ్వతం కావు... కానీ ప్రజల హృదయాల్లో సంపాదించిన స్థానం శాశ్వతం. ఆ నిజాన్ని తమ సేవా జీవితంతో నిరూపించిన ఆదర్శ దంపతులు పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి – సత్యవతి దంపతులు అని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# బాచుపల్లి పెద్ద చెరువులోకి మురికి నీరు కలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**కుత్బుల్లాపూర్, మే 17, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కుత్బుల్లాపూర్ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి ప్రాంతంలో సుమారు 43 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువు ( భైరవ చెరువు ) గత కొన్ని నెలలుగా తీవ్ర కాలుష్యానికి గురవుతోంది. గత సంవత్సరం అక్టోబర్ నెల నుండి పైప్రాంతాల నుండి వచ్చే డ్రైనేజ్ లైన్లకు సంబంధించిన 8 మ్యానువల్స్ పగిలిపోవడంతో ప్రతిరోజూ మురికి నీరు చెరువులోకి చేరుతోంది. దీంతో మంచినీటి చెరువు క్రమంగా మురికినీటి చెరువుగా మారిపోతోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
చెరువులోకి మురికి నీరు చేరడం వల్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వ్యాపించడంతో పాటు చెరువు నీటి రంగు పూర్తిగా మారిపోయింది. అదేవిధంగా ఎస్ఎన్‌డీపీ నాలాలో కూడా మురికి నీరు కలుస్తుండటంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. భవిష్యత్తులో ఈ చెరువును పునరుద్ధరించాలంటే కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే డిప్యూటీ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని కాలనీ ప్రజలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ ఆధ్వర్యంలో స్థానిక కాలనీ ప్రజలతో కలిసి మురికి నీరు చెరువులో కలుస్తున్న ప్రాంతంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వారి ప్రధాన డిమాండ్లు .



మురికి నీరు చెరువులోకి చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి.
పగిలిపోయిన మ్యానువల్స్‌ను వెంటనే మరమ్మతు చేయాలి.
మూడు ఫీట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి చెరువును అభివృద్ధి చేయాలి.
పెద్ద చెరువులకు వచ్చే ఎస్ ఎన్ డి పి నాలాలో మురికి నీరు కలపకూడదు.
భవిష్యత్తులో చెరువును మంచినీటి వనరుగా పరిరక్షించాలి.
నెల రోజులలో పనులు ప్రారంభించకపోతే నిజాంపేట్ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆకుల సతీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సుహాసిని శక్తి, గొల్ల కృష్ణ, హరీష్, మురళి, రమేష్, చందు, హనుమయ్య, పాండు, అంకం సతీష్ వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# భారత్ కు బంగ్లా బిగ్ షాక్..! తాజా అల్టిమేటం..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17 :
బంగ్లాదేశ్ లో కొత్తగా ఏర్పడిన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) సర్కార్ భారత్ కు భారీ షాకిచ్చింది. షేక్ హసీనా సర్కార్ ను కూలదోసిన తర్వాత షేక్ యూనుస్ నేతృత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం కొంతకాలం కొనసాగాక.. అక్కడ జరిగిన ఎన్నికల్లో బీఎన్పీ ఘన విజయం సాధించింది. దీంతో భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగుపడతాయని భావించిన వారికి నిరాశ తప్పలేదు. తమతో సంబంధాలు కావాలంటే తమ డిమాండ్ కు అంగీకరించాలని బంగ్లాదేశ్ అల్టిమేటం ఇచ్చింది.భారత్‌తో బంగ్లాదేశ్ సంబంధాలు కొత్త గంగా జలాల పంపిణీ ఒప్పందంపై ఆధారపడి ఉంటాయని అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బీఎన్పీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం అలంగిర్ స్పష్టం చేసారు. బంగ్లాదేశ్ అంచనాలు, అవసరాలకు అనుగుణంగా భారత్ తో తక్షణ చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవాలని కోరారు. 1996లో కుదిరిన ఇండో–బంగ్లాదేశ్ గంగా జలాల ఒప్పందం ఈ డిసెంబర్‌తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో గంగా జలాల పంపిణీ ఒప్పందం లేదా ఫరక్కా ఒప్పందంపై సంతకం కీలకమని బంగ్లా మంత్రి కూడా అయిన అలంగిర్ వెల్లడించారు.పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా అవామీ లీగ్ హయాంలో కుదిరిన 30 ఏళ్ల గంగా జలాల ఒప్పందం పునరుద్ధరణపై అనిశ్చితి, భవిష్యత్ జలాల పంపిణీ ఏర్పాట్లపై ఆందోళనలు పెంచుతున్నాయని అలంగిర్ ఆరోపించారు. కొత్త ఒప్పందం వచ్చేవరకు ప్రస్తుత ఒప్పందం అమల్లో ఉండాలని, భవిష్యత్ ఒప్పందాలు నిర్ణీత కాలానికి పరిమితం కారాదని ఆయన సూచించారు. వాయువ్య చపాయ్ నవాబ్‌గంజ్ జిల్లా మీదుగా బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించాక 'పద్మ'గా పిలువబడే గంగా నది, డెల్టా దేశానికి ప్రధాన నదీ వ్యవస్థ. భారత్‌లో ఉద్భవించే లేదా ప్రవహించే 54 నదులతో సహా వందలాది నదులు దీన్ని దాటుతాయి. బంగ్లాదేశ్ 170 మిలియన్ల ప్రజలలో దాదాపు మూడింట ఒక వంతు మంది జీవనోపాధి, జీవవైవిధ్యం, అనేక ఉపనదులకు నీటి సరఫరా కోసం ఈ వ్యవస్థపై ఆధారపడి ఉన్నారని అలంగిర్ తెలిపారు.తాజాగా బంగ్లాదేశ్ పద్మా నదిపై బ్యారేజీ నిర్మాణానికి భారీ ప్రాజెక్టును ఆమోదించిన మూడు రోజుల తర్వాత బీఎన్పీ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ బ్యారేజీ, భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా బ్యారేజీ "ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడంలో" సహాయపడుతుందని బంగ్లాదేశ్ పేర్కొంది. ఈ ప్రాజెక్టు 2033 నాటికి పూర్తవుతుందని అంచనా. మరోవైపు ఫరక్కా బ్యారేజీ ప్రధానంగా కోల్‌కతా ఓడరేవును పరిరక్షించడానికి నిర్మించినట్లు భారత్ ఎప్పటి నుంచో వాదిస్తోంది. రెండు దేశాల మధ్య కుదిరిన గంగా జలాల పంపిణీ ఒప్పందంతో సహా ద్వైపాక్షిక యంత్రాంగాలు, ఒప్పందాల ద్వారా జలాల పంపిణీ సమస్యలు పరిష్కారం జరిగినట్లు భారత్ స్పష్టం చేస్తోంది.



# నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత భరోసా : ఎంపీ చామల




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : పెద్ద అంబర్ పేట నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక భరోసాగా నిలుస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం రోజు పెద్దఅంబర్ పేటలో ఆయన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కొత్తగూడెంలో విషాదం.. పురుగుల మందు తాగి తల్లి బిడ్డ ఆత్మహత్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, కొత్తగూడెం :
గత నెల 28వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లి, కుమార్తె చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన విషాద ఘటన కొత్తగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తగూడెం బాబు క్యాంపు కాలనీలో నివాసముండే రమ్య భర్త రెండు నెలల క్రితం మృతి చెందాడు. భర్త మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన రమ్య గత నెల 28న తన 9 ఏళ్ల కుమార్తె అధ్యకు పురుగుల మందు ఇచ్చి, తాను కూడా విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి, కుమార్తె ఇద్దరూ ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫ్లెక్సీలకు పాలభిషేకాలు... పాడి రైతుల అకౌంట్లలో డబ్బులు వేయండి.....



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ?రాజపేట మండలం పాముకుంట గ్రామంలో పాడి రైతు కాకల్ల నవీన్ విలేకర్లతో మాట్లాడుతూ..... ఇగోవచ్చే అగోవచ్చే అంటూ మదర్ డైరీ పెండింగ్ పాల బిల్లుల పేరుతో హంగులు, ఆర్భాటాలు, ప్రచారాలు చేశారు. రూ. 10 కోట్లు విడుదలయ్యాయని డబ్బా కొట్టుకున్నారు తప్ప, చెమటోడ్చి పాలు పోసిన పాడి రైతు ఖాతాలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పడలేదు. ?రైతులను నట్టేట ముంచుతూ... మదర్ డైరీ యాజమాన్యం ఆడుతున్న నాటకాలను పాడి రైతులు ఇక నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ?పెరిగిన ధరల ముచ్చట ఎవరికోసం? పాలకు ధర పెంచామని కల్లబొల్లి మాటలు చెప్పి, రైతులను ఆకర్షించి పాలు పోయించుకోవడానికి చూస్తున్నారు తప్ప పాలు పోసిన రైతులకు మొత్తం బిల్లులు చెల్లించే గతి లేదా? ?పదవుల పై ఉన్న శ్రద్ధ రైతుల పై ఏది? చైర్మన్లకు, డైరెక్టర్లకు వారి పదవుల మీద ఉన్న ఇంట్రెస్ట్, అన్నం పెట్టే పాడి రైతుల మీద ఎందుకు లేదు? డైరీలలో సమావేశాలు పెట్టి 'పాల సేకరణ' గురించి మాట్లాడటం కాదు ముందు పెండింగ్ బిల్లుల విడుదల గురించి మాట్లాడండి! ?ఆర్భాటాలు వద్దు అకౌంట్లలో డబ్బులు వేయండి ప్రచార ఆర్భాటాలు ఆపి, వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలి. ?మదర్ డైరీకి సంబంధించిన 7 పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలి. లేనిపక్షంలో పాడి రైతుల ఆగ్రహాన్ని, పోరాటాన్ని ఉధృతం చేయాల్సి వస్తుంది! నాకు 7 బిల్లులు రావాలి బిల్లులు విడుదల చేసిన అని చెపుతున్నారు కానీ రైతులకు మాత్రం రాలేదు దీనికోసం మదర్ డైరీ ఛైర్మెన్ వచ్చిన డైరెక్టర్లు వచ్చిన బహిరంగ చర్చకు సిద్ధం అని అన్నారు.

# బెతెస్తా చర్చ్ లో ఉచిత ఫ్రీజర్ సేవలు..







న్యాల్ కల్ మే 17, హైదరాబాద్ పల్స్ న్యూస్ :
కుల మతాలకు అతీతంగా అవసరమైన వారందరూ ఈ ఉచిత బాడీ ఫ్రీజర్ సేవలను వాడుకోవచ్చునని బేతేస్తా పరిశుధాత్మ ప్రార్థన మినిస్ట్రీస్ పులిలోంక వ్యవస్థాపక అధ్యక్షులు రెవ. డాక్టర్ ప్రశాంత్ బెంజిమెన్ అన్నారు. బెతేస్తాలో ఇదివరకే కొనసాగుతున్న అనేక సేవా కార్యక్రమాలలో భాగంగా ఉచిత బాడీ ఫ్రీజర్ సేవలు కొనసాగుతున్నాయి. కొన్ని సందర్భాలలో అవసరమైనప్పుడు ఒకేసారి ఇద్దరు ముగ్గురికి ఫ్రీజర్ అవసరం ఉంటే ఇబ్బంది కలుగుతున్న సంగతిని గుర్తించిన పాస్టర్ ప్రశాంత్ బెంజిమెన్ జేకే చారిటేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బొమ్మ దేశెట్టి పాటిల్ గుంజెట్టి సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తన తండ్రి శేఖర్ పాటిల్ జ్ఞాపకార్థం ఫ్రిజర్ ను పులిలోంక బేతేస్తా చర్చి కి బహుకరించడం జరిగిందని రెవ. డాక్టర్ ప్రశాంత్ బెంజిమెన్ తెలిపారు. ఈ సేవలను ఉచితంగానే ఉపయోగించుకోవచ్చన్నారు. న్యాల్కల్ మండలం, రాయికోడ్, ఝరాసంగం మండల పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి, రానున్న కాలంలో ఇంకా అనేక రకాల ప్రజా సేవా కార్యక్రమాలు బేతేస్తా మందిరంలో చేపడతామని అన్నారు. సేవా కార్యక్రమానికి తోడ్పాటుగా నిలిచి బాడీ ఫ్రీజర్ బహుకరియించిన దేశెట్టి పాటిల్ ను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మ దేశెట్టి పాటిల్ కు బేతెస్తా సంఘస్తులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# వడ్డెరలు 2029 నాటికి చట్టసభల్లో అడుగుపెట్టాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న






హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : కూకట్పల్లిలో వడియరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్యవంశం వడియరాజు క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లన్న మాట్లాడుతూ... వడ్డెర జాతి బిడ్డలంతా ఏకతాటిపైకి వచ్చి తమ రాజకీయ ఆకాంక్షలను పెంపొందించుకోవాలని, 2029 నాటికి చట్టసభల్లో (అసెంబ్లీ) వడ్డెరలు అడుగుపెట్టడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వడ్డెర సామాజిక వర్గ సభలో పాల్గొన్న ఆయన జాతి చరిత్ర, ఎదుర్కొంటున్న సవాళు ,, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు.

**చరిత్రను వక్రీకరించారు**

వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారు వాస్తవానికి రాజులు (వడియ రాజులు) అని, కానీ కాలక్రమంలో సమాజం వారిని బందిపోటు దొంగలుగా చిత్రీకరించి తీవ్ర అవమానాలకు గురిచేసిందని మల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు. మొరాకో దేశంలో మైనింగ్ ద్వారా 3 లక్షల 15 వేల సంవత్సరాల క్రితం నాటి మానవ అవశేషాలను వెలికితీసిన ఘనత ఈ సామాజిక వర్గానిదేనని గుర్తుచేశారు. ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న సమాజాన్ని దోపిడీదారులుగా ముద్ర వేయడం బాధాకరమని, వాస్తవానికి మన హక్కులను, సంపదను దోచుకునే వారే అసలైన దొంగలు అని ఆయన స్పష్టం చేశారు.

**ఎదిగితే దాడులు చేస్తున్నారు**

హైదరాబాద్ నగరంలో సుమారు 60 శాతం సివిల్ మరియు సీసీ వర్క్లను వడ్డెర సామాజిక వర్గం కాంట్రాక్టర్లే ఐక్యంగా ఉండి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. అయితే ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతున్న క్రమంలో ఆధిపత్య వర్గాల (రెడ్లు) నుండి దాడులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఒక వడ్డెర మైనింగ్ వ్యాపారి సామ్రాజ్యాన్ని లాక్కోవడానికి ఆధిపత్య వర్గాలు ఆయనపై హత్యాయత్నం చేసిన సంఘటనను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

**జనాభా ఎక్కువ – ప్రాతినిధ్యం శూన్యం**

తెలంగాణలో ఆధిపత్య వర్గమైన వెలమల కంటే వడ్డెరల జనాభా నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ చట్టసభల్లో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకపోవడం శోచనీయం అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా మొత్తం మీద వెలమలు కేవలం 5,730 మంది ఉంటే, ఒక్క సిద్దిపేట మండలంలోనే 5,000 మంది వడ్డెరలు ఉన్నారని గణాంకాలు వివరించారు. శేరిలింగంపల్లిలో ఉన్న వడ్డెరలంతా ఏకమైతే, అక్కడి ఎమ్మెల్యే సీటును సునాయాసంగా గెలుచుకోవచ్చని, కాబట్టి వడ్డెరలు కచ్చితంగా రాజకీయాల్లోకి రావాలని కోరారు.

**బీసీల పక్షాన నిలబడాలి – 2029లో బీసీలదే రాజ్యం**


వడ్డెరలు నూటికి నూరు శాతం ప్యూర్ బీసీలు అని, వారు గర్వంగా బీసీలమని చెప్పుకోవాలని సూచించారు. 2029లో తెలంగాణలో రాబోయేది బీసీ ప్రభుత్వమేనని, ఆ ప్రభుత్వంలో వడ్డెరలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మాజీ మావోయిస్ట్, ప్రస్తుత బీసీ ఉద్యమకారుడైన భువనగిరికి చెందిన శంకరన్న భవిష్యత్తులో కచ్చితంగా ఎమ్మెల్యే అవుతారని, ఆయనకు యావత్ బీసీ సమాజం అండగా నిలబడుతుందని ప్రకటించారు.

**సాంస్కృతిక ఉద్యమం నిర్మించాలి**

రాజకీయ లక్ష్యాలను చేరుకోవడానికి ముందుగా బలమైన సాంస్కృతిక ఉద్యమం అవసరమని మల్లన్న స్పష్టం చేశారు. జాతి గొప్పతనాన్ని, చరిత్రను వెలికితీస్తూ పాటలు, పుస్తకాలు, సెమినార్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని పాటలే నడిపించినట్లుగా, వడ్డెరల చరిత్ర కూడా ఒక సాంస్కృతిక ఉద్యమంగా మారినప్పుడే అది విజయవంతం అవుతుందని దిశానిర్దేశం చేశారు. దేశ సంపదను, మైనింగ్ రంగాన్ని అంబానీ, అదానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులు తమ గుప్పెట్లోకి తీసుకుంటున్నాయని, ఇటువంటి పరిణామాలను అడ్డుకునేందుకు బడుగు వర్గాలు ఆలోచించి రాజకీయ అధికారం దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న సూచించారు.

# బసంతాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల ధాన్యం?

## నేడు కేంద్రాన్ని సందర్శించనున్న జిల్లా అధికారులు అప్పటికే ఒక లోడ్ ధాన్యం మిల్లుకు సరఫరా!



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బసంతాపురం సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల ధాన్యం చేరినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఒక లోడు ధాన్యం మిల్లుకు సరఫరా అయినట్లు చెబుతున్నారు. కాగా ఈ విషయం మండల జిల్లా అధికారులకు సమాచారం అందడంతో సోమవారం రోజు బసంతాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తగు చర్యలు తీసుకొనున్నట్లు ఏపీఎం మురారి చెబుతున్నారు. ఆదివారం విలేకరులకు ఆయన వివరాలు చెబుతూ దళారుల ధాన్యం బసంతాపురం కొనుగోలు కేంద్రంలో రైతులకు సంబంధించిన ధాన్యం కాకుండా వేరే కుప్పలు ఉన్నాయని ఫిర్యాదు వచ్చినట్లు చెప్పారు. ఈ విషయంపై రాజపేట మండలంలోని కాకుండా జిల్లా స్థాయిలో తీవ్ర చర్చ నెలకొంది. గత ఏడాది దూది వెంకటాపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల ధాన్యం పై జరిగిన రగడ తెలిసినప్పటికీ ప్రస్తుత ఏపీఎం నిర్వహిస్తున్న మహిళా సంఘాలు నిర్లక్ష్యం వహించడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.

**నెల రోజులైనా 30 శాతం దాన్యం తరలింపు**


రాజపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్న కేవలం 30 శాతం దాన్యం మాత్రమే మిల్లులకు తరలింపు జరిగింది. అంతకుముందు జిల్లా మండల స్థాయి అధికారుల నివేదిక ప్రకారం సుమారు ఐదు లక్షల బస్తాల ధాన్యం రాజపేట మండలంలో రైతుల నుండి కొనుగోలు చేయాల్సి వస్తుందని లెక్కలు చెబుతుండగా, ఇప్పటివరకు 1,52,284 బస్తాలు రైస్ మిల్ కు తరలించారు. మొత్తం 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 14 ఐకెపి ద్వారా మిగిలిన 6 మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్నాయి. మహిళా సంఘాల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ తరలింపు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 2,27,397 బస్తాల ధాన్యం సేకరణ జరగగా కొనుగోలు కేంద్రాలలో 77,653 బస్తాలు తరలింపుకు సిద్ధంగా ఉన్నాయి. అంతేకాకుండా మరో రెండున్నర లక్షల ధాన్యం బస్తాల రాశు లు 20 కేంద్రాలలో ఉన్నట్లు అంచనా. 14 ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు 1,77,397 ధాన్యం బస్తాలు సేకరణ జరగగా 1,38,84 బస్తాలు రైస్ మిల్లుకు తరలింపు అయ్యాయి మిగిలిన 39053 ధాన్యం బస్తాలు కేంద్రాలలో నిల్వ ఉన్నాయి. మహిళా సంఘాల ద్వారా కొనసాగుతున్న ఆరు కేంద్రాలలో 52 ధాన్యం బస్తాలు సేకరణ జరగగా 13,400 బస్తాలు తరలింపు జరగగా 38,600 బస్తాలు కేంద్రాలలో నిల్వ ఉన్నట్లు ఏపీఎం చెప్పారు. మరో 40 వేల బస్తాలకు పైగా ధాన్యం కుప్పలు ఉన్నట్లు ఆయన తెలిపారు. నెల రోజుల్లో కేవలం 30 శాతం దాన్యం మాత్రమే రైస్ మిల్లులకు తరలింపు జరగగా మరో 70% ధాన్యం బస్తాలు ధాన్యం రాశులు కేంద్రాలలో ఉన్నాయి. ఈ విషయంపై రైతులు ఆందోళన చెందుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నత్త నడకన ధాన్యం కొనుగోలు సాగుతున్నట్లు విమర్శిస్తున్నారు. అకాల వర్షాల వల్ల తమ ధాన్యం కు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం..తృటిలో తప్పిన ముప్పు!



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:
యాదాద్రి భువనగిరి జిల్లా దామరచర్ల పరిధిలోని యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌కు చెందిన మూడో యూనిట్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురయ్యారు. టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పంప్ వద్ద ఒక్కసారిగా ఆయిల్ లీక్ కావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. లీకైన ఆయిల్ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ పరిసర ప్రాంతాలన్నింటినీ దట్టమైన పొగ కమ్మేసింది. ఈ ఘటనలో ప్లాంట్‌కు చెందిన కీలకమైన కంట్రోల్ కేబుల్స్, కొన్ని వాల్వ్‌లు పూర్తిగా కాలిపోయి దెబ్బతిన్నాయి. అయితే, అగ్నిమాపక సిబ్బంది, ప్లాంట్ అంతర్గత రక్షణ బృందాలు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రధాన టర్బైన్ యంత్రాలకు, బాయిలర్లకు తృటిలో పెద్ద ముప్పు తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయిల్ లీకేజీకి దారితీసిన పరిస్థితులు మరియు ప్రమాదానికి గల పూర్తి సాంకేతిక కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ ప్రమాదం వల్ల మూడో యూనిట్ ట్రయల్ రన్ ప్రక్రియకు కొంత ఆటంకం కలిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# సుప్రీంకోర్టులో జడ్జిల పెంపునకు రాష్ట్రపతి ఆమోదం.. 34 నుంచి 38కి పెరుగనున్న సంఖ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, సెంట్రల్ డెస్క్ :
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. దీంతో సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, సత్వర న్యాయం అందించేందుకు వీలవుతున్నారు. కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన ప్రతిపాదనకు అనుగుణంగా, రాష్ట్రపతి 'సుప్రీంకోర్టు సవరణ ఆర్డినెన్స్, 2026'ను జారీ చేశారు. దీంతో ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 34 నుంచి 38కి పెరుగనుంది. 2019 తర్వాత సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్యను పెంచడం ఇదే మొదటిసారి.కాగా, దేశ అత్యున్నత న్యాయస్థానంలో రెండు న్యాయమూర్తులు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత సీజేఐ సూర్యకాంత్ కంటే ముందు ఆ పదవిలో ఉన్న జస్టిస్ బీఆర్ గవాయ్ గతేడాది నవంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఈ ఏడాది ఎప్రిల్‌లో జస్టిస్ రాజేశ్ బిందాల్ రిటైర్ అయ్యారు. 2026 చివరి నాటికి మరో ముగ్గురు జడ్జిలు పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పంకజ్ మిట్టల్ వచ్చే నెలలో, జస్టిస్ సంజయ్ కరోల్ ఆగస్టులో రిటైర్ కానున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు 92,000 కంటే ఎక్కువ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జడ్జిల సంఖ్య పెంపునకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో, ఈ ఆర్డినెన్స్‌ను రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు రూపంలో ప్రవేశపెట్టి, ఉభయ సభల ఆమోదంతో పూర్తిస్థాయి చట్టంగా మార్చనున్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు...



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న మోడిఫైడ్ సైలెన్సర్లపై భువనగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగింపజేసినట్లు ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా శబ్ద కాలుష్యం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ...
# వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో "స్పార్క్" కార్యక్రమం నిర్వహణ

**మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు, ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్.**




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే ఉద్దేశ్యంతో ఆదివారం నాడు సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో "స్పార్క్" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. ముందుగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి జిల్లా విద్యార్థులందరికీ జిల్లా పోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి విద్యా ప్రగతికి తోడ్పడాలనే లక్ష్యంతో "స్పార్క్-(సపోర్టింగ్ పొటెన్షియల్ అకడమిక్ రైజ్ ఫర్ ఖాకీ కిడ్స్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. "స్పార్క్" అనేది చిన్న నిప్పురవ్వ లాంటిదని, దానిని సక్రమంగా ఉపయోగిస్తే వెలుగుని, ఉపయోగాన్ని ఇస్తుందని అన్నారు. అదే నిర్లక్ష్యం చేస్తే పెద్ద అగ్నిలా మారి నియంత్రణకు అందకుండా పోవచ్చని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే పిల్లల్లో ఉన్న ప్రతిభను సరైన దిశలో ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, ఈ సమయంలో విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. అదే చెడు అలవాట్లకు బానిసలైతే జీవితంలో ముందుకు సాగడం కష్టమవుతుందని తెలిపారు. సెల్‌ఫోన్‌ను పిల్లలు మంచి పనుల కోసమే వినియోగిస్తున్నారా లేదా అన్న విషయాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. అలాగే పిల్లలను మరీ కఠినంగా గానీ, అతిగా గారాబంగా గానీ పెంచకుండా సమతుల్య విధానంలో పెంచాలని సూచించారు. 90కి పైగా శాతం మార్కులు సాధించడం సాధారణ విషయం కాదని, అది విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు ఇదే పట్టుదలతో తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ జిల్లా పోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ "స్పార్క్" కార్యక్రమం ద్వారా పోలీసు కుటుంబాల పిల్లల్లో విద్యాపట్ల మరింత ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాల్లో కూడా ముందుండాలని అన్నారు. కష్టపడే తత్వాన్ని నమ్మినవారు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, ప్రతి విద్యార్థి పెద్ద కలలు కనాలని, ఆ కలలను నిజం చేసుకునేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విజయం ఒక్క రోజులో రాదని, నిరంతర కృషి, సమయపాలన, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. మీ తల్లిదండ్రులు (పోలీసులు) మీకు సరైన సమయం ఇవ్వలేకపోవచ్చని, ముఖ్యంగా పండుగలు, ఇతర ఉత్సవాల సమయంలో వారు రాత్రింబవళ్లు విధులు నిర్వహించడం వల్లనే ప్రజలు ఆనందంగా, ప్రశాంతంగా జీవిస్తున్నారని, అందుకు కారణం మీ తల్లిదండ్రులేనని గుర్తించాలని అన్నారు. మీ తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి, ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిటిసి అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, సైదా నాయక్, ఆర్‌డీఎస్పీ నరేందర్, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు సురేష్, రాజశేఖర్ రెడ్డి, డానియేల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# కేంద్రం ఇచ్చే రూ.10 లక్షల సబ్సిడీ వదులుకోకండి!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, సెంట్రల్ డెస్క్ : దేశంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడంతో పాటు ఆహార శుద్ధి రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన పథకాన్ని అమలు చేస్తోంది. అదే 'పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్'. కొత్తగా ఏదైనా తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించాలనుకునే వారికి, లేదా ఇప్పటికే నడుస్తున్న పాత యూనిట్లను ఆధునీకరించి విస్తరించాలనుకునే వారికి ఈ పథకం కొండంత ఆర్థిక అండగా నిలుస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ సువర్ణావకాశాన్ని ఉపయోగించుకుని సొంతంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నారు. ఈ పథకం కింద అర్హులైన అభ్యర్థులకు మొత్తం ప్రాజెక్టు ఖర్చులో గరిష్ఠంగా 35 శాతం లేదా గరిష్ఠంగా రూ. 10 లక్షల వరకు క్రెడిట్-లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఉదాహరణకు, మీరు పెట్టబోయే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టుబడి ఖర్చు రూ.25 లక్షలు అనుకుంటే.. అందులో 35 శాతం చొప్పున రూ.8.75 లక్షలు సబ్సిడీ రూపంలో లభిస్తుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా సులభమైన వ్యాపార రుణాల రూపంలో పొందవచ్చు. దీనివల్ల వ్యాపారం ప్రారంభించడానికి చేతిలో పెద్దగా డబ్బు లేకపోయినా.. సొంతంగా పరిశ్రమ పెట్టాలనే కల నెరవేరుతుంది.

**ఈ పథకానికి ఎవరెవరు అర్హులు?**

ఈ పథకం కింద వ్యక్తిగత పారిశ్రామికవేత్తలతో పాటు పలు సమూహాలు కూడా లబ్ధి పొందవచ్చు.

**వ్యక్తిగత దరఖాస్తుదారులు:**

కనీసం 18 సంవత్సరాల వయస్సు నిండి, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులైన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ఈ సబ్సిడీ లభిస్తుంది.

**సమూహాలు:**

స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పాదక సంస్థలు, సహకార సంఘాలు కూడా ఈ పథకం కింద ఉమ్మడి మౌలిక వసతుల కల్పన లేదా ప్రాసెసింగ్ యూనిట్ల కోసం లోన్ మరియు సబ్సిడీని పొందవచ్చు.




**ఏయే వ్యాపారాలకు లోన్ ఇస్తారు?**

ఆహార పదార్థాల తయారీ, ప్యాకేజింగ్, నిల్వకు సంబంధించిన దాదాపు అన్ని రకాల చిన్న తరహా పరిశ్రమలకు ఈ పథకం వర్తిస్తుంది. ముఖ్యంగా 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' (ఒక జిల్లా ఒక ఉత్పత్తి) కింద ఎంపిక చేసిన స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత ఉంటుంది.

**పచ్చళ్లు, మసాలా పొడుల తయారీ యూనిట్లు.**

బేకరీ ప్రొడక్ట్స్, స్నాక్స్, బిస్కెట్ల తయారీ. పండ్ల రసాలు (జ్యూస్), జెల్లీలు, జామ్ ల ప్రాసెసింగ్. పిండి మిల్లులు, పప్పు మిల్లులు, నూనె మిల్లులు. డైరీ ఉత్పత్తులు (పాలు, నెయ్యి, పన్నీర్ తయారీ), మాంసం, చేపల ప్రాసెసింగ్ యూనిట్లు.

**దరఖాస్తుకు కావాల్సిన ముఖ్యమైన పత్రాలు**

ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునే సమయంలో కింది పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి:
దరఖాస్తుదారుడి ఆధార్ కార్డ్ మరియు పాన్ కార్డ్
విద్యార్హత ధృవీకరణ పత్రం (కనీసం 8వ తరగతి పాస్ సర్టిఫికెట్).
బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ లేదా క్యాన్సిల్ చెక్ లీఫ్.
వ్యాపారానికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్ట్.
ఇప్పటికే వ్యాపారం ఉంటే దానికి సంబంధించిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్, గత లావాదేవీల వివరాలు.

**దరఖాస్తు చేసుకునే విధానం ఇదే..**

ఈ పథకం కోసం అర్హులైన అభ్యర్థులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది:
వెబ్‌సైట్ ఓపెన్ చేయండి:
ముందుగా కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన అధికారిక పోర్టల్ ను సందర్శించండి.

**రిజిస్ట్రేషన్:**

హోమ్‌పేజీలో 'ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్' పై క్లిక్ చేసి, అభ్యర్థి వివరాలతో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.
ఫారమ్ పూర్తి చేయండి:
ఆ తర్వాత లాగిన్ అయ్యి అప్లికేషన్ ఫారమ్‌లో వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు, మీ ప్రాజెక్ట్ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి.

**పత్రాల అప్‌లోడ్:**

**పైన పేర్కొన్న అన్ని అవసరమైన పత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.**

పరిశీలన & లోన్ మంజూరు: మీరు సమర్పించిన అప్లికేషన్‌ను మొదట జిల్లా స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. అంతా సరిగ్గా ఉంటే, మీ దరఖాస్తును మీరు ఎంచుకున్న బ్యాంకుకు పంపుతారు. బ్యాంక్ అధికారులు మీ ప్రాజెక్టును అంచనా వేసి లోన్‌తో పాటు సబ్సిడీని మంజూరు చేస్తారు.

# భారత్ కు బిగ్ రిలీఫ్.. 20 వేల టన్నుల ఎల్పీజీ తో భారత్ కు చేరుకున్న నౌక

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. యుద్ధం కారణంగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తింది. అటు భారత్ లోనూ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. పశ్చిమాసియాలో పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు కీలక సూచనలు చేసిన విషయం తెలిసిందే. విదేశీ మారక ద్రవ్యం నిల్వలను కాపాడుకోవడానికి ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలని సూచించారు. సంవత్సరం పాటు బంగారం కొనుగోలు చేయొద్దని తెలిపారు. ఏడాదిపాటు విదేశీ ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా ప్రధాని మోదీ తన కాన్వాయ్ ను కేవలం రెండు వాహనాలకు మాత్రమే పరిమితం చేశారు. ఇక దేశంలో ఇంధన సంక్షోభం వేళ హార్ముజ్ జలసంధిని దాటిన ఎల్పీజీ లోడ్ తో ఉన్న ట్యాంకర్ సైమీ తాజాగా గుజరాత్ లోని కండ్ల పోర్టుకు చేరుకుంది. మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్న ఈ నౌక దాదాపు 20 వేల టన్నుల ఇంధనాన్ని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల మధ్య మే 13 న ఈ నౌక హార్ముజ్ జలసంధిని దాటింది. నాలుగు రోజుల తర్వాత ఇప్పుడు భారత్ కు చేరుకుంది. ఈ నౌకలో 8 మంది ఉక్రెయిన్లు, 13 మంది ఫిలిప్పీన్స్ దేశస్థులు కలిపి మొత్తం 21 మంది విదేశీ సిబ్బంది ఉన్నారు. ఈ కార్గో లోడ్ మొత్తం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కు చెందినది. ఇరాన్ - అమెరికా యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి గుండా రవాణా స్తంభించిపోయింది. గత రెండు నెలల్లో భారత చమురు నిల్వలు దాదాపు 15 శాతం తగ్గాయి. ఈ క్రమంలోనే దేశంలో ఇంధనాన్ని పొదుపుగా వాడాలని ప్రధాని నరేంద్ర మోదీ కూడా ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ఈ గ్యాస్ సరఫరా రావడం భారత్ కు పెద్ద ఊరటను కలిగించే అంశం. భారత రక్షణ శాఖ, విదేశాంగ శాఖ, పెట్రోలియం శాఖ, ఇండియన్ నేవీ సంయుక్తంగా జరిపిన సమన్వయంతో భద్రతా చర్యలు పర్యవేక్షించడం వల్లే ఈ నౌక సురక్షితంగా చేరుకుంది. ఇక ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రక్షణకు ఇరాన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, భారత్ లాంటి మిత్ర దేశాల నౌకల భద్రతకు పూర్తి హామీ ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ నౌకతో పాటు మరో ఎల్పీజీ నౌక ఎన్వీ సన్ షైన్ కూడా హార్ముజ్ జలసంధిని దాటి మే 18న మంగళూరు పోర్టుకు చేరుకుంది.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బొందుగుల గ్రామంలో ఉన్నత పాఠశాలలోని 2006 - 2007 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. విద్య నేర్పిన గురువులను ఆహ్వానించిన పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలోని తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులతో మరోసారి ఆశీర్వాదం పొందారు. వారిని సత్కరించారు. సామూహికంగా భోజనాలు చేసి ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. చదువుకున్న పాఠశాలను చూసుకున్న పూర్వ విద్యార్థులు సంతోషపడ్డారు.

# బీర్ల ఐలయ్యను కలిసిన బీరప్ప యూత్ కమిటీ సభ్యులు



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆలేరు శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను యదగిరిగుట్టలో తన నివాసంలో ఆదివారం బొందుగుల బీరప్ప యూత్ కమిటీ సభ్యులు కలిశారు. యూత్ అసోసియేషన్ తరుపున యూత్ భవనం, యూత్ అసోసియేషన్ అభివృద్ధి కోసం అడగగా సానుకూలంగా స్పందించిన బీర్ల ఐలయ్య త్వరలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు జెట్ట శ్రీకాంత్, ఉపాధ్యక్షులు బాల్గా శ్రీకాంత్, కోశాధికారి మర్ల కర్ణాకర్, యూత్ సభ్యులు బాల్గా కర్ణాకర్, జెట్ట సురేష్, బాల్గా శ్రీకాంత్, గవ్వల ఉపేందర్, 3వ వార్డ్ సభ్యులు మర్ల రమేష్, కురుమ సంఘం అధ్యక్షులు బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మర్ల సమ్మయ్య, కురుమ సంఘం మాజీ అధ్యక్షులు మాపు భాస్కర్ తదితరులు ఉన్నారు

# సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన పాల వెంకటేష్ గౌడ్



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాల వెంకటేష్ గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన సందర్భంగా హైదరాబాదులోని మల్లాపూర్ లో పలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

# రాజపేటలో సర్పంచుల ప్రత్యేక సమావేశం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల సర్పంచులు ఆదివారం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రాజపేట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలు అంశాలపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజపేట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# భారత్ కు బ్యాడ్ న్యూస్: పెట్రోల్, గ్యాస్ ధరలు మళ్లీ పెరిగే అవకాశం..?


హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17 :
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల్ని వణికిస్తున్నాయి. ముడి చమురు, గ్యాస్, విద్యుత్ సంక్షోభంతో అల్లాడుతున్నాయి. అమెరికా- ఇరాన్ యుద్ధం కారణంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఈ దారుణమైన పరిస్థితులు తలెత్తాయి. ప్రపంచ దేశాలతో పాటు భారత్ కు కీలకమైన సముద్ర రవాణా మార్గం ఇదే. ఇక భారత్ చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఇందులో 60 నుంచి 65 శాతం వరకు చమురు హోర్ముజ్ జలసంధి ద్వారానే మన దేశానికి చేరుతుంది. ఈ వాణిజ్య మార్గం మూసివేసిన నేపథ్యంలో భారత్ లో పెట్రోల్, డీజిల్ సంక్షోభం తలెత్తింది. అందువల్లనే ఇటీవల దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచింది కేంద్ర ప్రభుత్వం. లీటర్ పై రూ. 3 వరకు పెంచింది. అయితే తాజాగా భారత్ కు మరో షాక్ తగిలింది. రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న భారీ చమురు శుద్ధి కార్మాగారంపై ఉక్రెయిన్ తాజాగా దాడులకు పాల్పడింది. ఈ దాడి కారణంగా అక్కడ భారీ ఎత్తున మంటలు చెలరేగి నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. మరికొంతమంది గాయపడ్డారు. అయితే ఈ రిఫైనరీ ఏటా దాదాపు 17 మిలియన్ టన్నుల ముడి చమురును ప్రాసెస్ చేస్తుంది. ఈ దాడితో రష్యా చమురు ఉత్పత్తి, సరఫరాకు మరింత ఆటంకం కలిగే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా తాజా ఆంక్షలు విధించింది. గతంలో ఇచ్చిన తాత్కాలిక మినహాయింపును పొడిగించకూడదని నిర్ణయించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ మినహాయింపును రెండు సార్లు పొడిగించినప్పటికీ ఈ సారి దానిని నిలిపివేయడంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై ఒత్తిడి ఏర్పడింది. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల కారణంగా సరఫరా కొరత ఏర్పడుతుందనే భయంతో ఈ మినహాయింపును పొడిగించాలని భారత్, ఇండోనేషియా లాంటి దేశాలు విజ్ఞప్తి చేసినప్పటికీ అమెరికా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక ఇప్పటికే హోర్ముజ్ లో ఉద్రిక్తతలు అలాగే ఈ పరిణామాల




నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే భారత్ లోనూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉన్నట్లు స్పష్టం అవుతోంది.

# ఎబోలా కలకలం...
## గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17 :
కాంగో, ఉగాండా దేశాల్లో ఎబోలా వైరస్ తీవ్ర రూపం దాలుస్తోంది. ఈ రెండు దేశాల్లో కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' (అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి) ప్రకటించింది. ప్రస్తుతం వ్యాపిస్తున్న ఎబోలాకు 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ కారణమని వైద్య నిపుణులు గుర్తించారు. ఈ నిర్దిష్ట స్ట్రెయిన్‌కు వ్యతిరేకంగా పనిచేసే సమర్థవంతమైన వ్యాక్సిన్ గానీ, ప్రత్యేకమైన యాంటీవైరల్ చికిత్స గానీ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడమే ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించే ప్రధానాంశంగా మారింది. ఈ వైరస్ ముప్పు ఎంత తీవ్రంగా ఉందంటే, కాంగోలో ఇప్పటివరకు దీని బారిన పడి 88 మంది ప్రాణాలు కోల్పోగా, పొరుగు దేశమైన ఉగాండాలోనూ ఒకరు మృతి చెందారు. కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో సరిహద్దు దేశాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఎబోలా అనేది సోకిన వ్యక్తుల రక్తం, లాలాజలం, ఇతర శారీరక ద్రవాల ద్వారా నేరుగా ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుంది. జ్వరం, తీవ్రమైన నీరసం, కండరాల నొప్పులు, గొంతు నొప్పి వంటి లక్షణాలతో ప్రారంభమై, ఆ తర్వాత వాంతులు, విరేచనాలు మరియు అంతర్గత, బాహ్య రక్తస్రావానికి దారితీస్తుంది. ఈ వైరస్ మరణాల రేటు చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఖచ్చితమైన చికిత్స లేనందున.. కేవలం రోగి శరీరంలో ద్రవాల శాతాన్ని సమతుల్యంగా ఉంచడం, లక్షణాలకు అనుగుణంగా ఇచ్చే సహాయక వైద్యం ద్వారానే ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రయాణాల ద్వారా ఈ వైరస్ ఇతర ప్రాంతాలకు





వ్యాపించకుండా నిరోధించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి స్థానిక ప్రభుత్వాలు క్వారంటైన్, ముందస్తు స్క్రీనింగ్ చర్యలను ముమ్మరం చేశాయి.

# దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17 :
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం ఇటీవలే పెట్రోల్, డీజిల్ రేట్లను భారీగా పెంచింది. లీటర్ పై రూ.3.50 పైసల మేర వడ్డించింది. ఈ పెంపు ఇక్కడితో ఆగకపోవచ్చు. మున్ముందు వీటి రేట్లు భారీగా పెరగొచ్చనే అంచనాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, డాలర్ తో పోల్చుకుంటే రూపాయి విలువ భారీగా పడిపోతోండటం వల్ల ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు వచ్చే భారీ నష్టాలను పూడ్చుకోవడానికి వాహనదారులపై పడ్డాయి. ఈ పెంపు ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా పడింది. వీటి రేట్లు ఇక్కడే అధికం. ఉత్తరాదిన రాజస్థాన్ లో అత్యధిక రేటు పలుకుతున్నాయి పెట్రోల్, డీజిల్. వాహనదారులకు అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా నిలిచాయి. అధిక వ్యాట్, రవాణా ఛార్జీల వల్ల ఆయా ప్రాంతాలలో ధరలు జాతీయ సగటు కంటే ఎక్కువ. పెంపునకు ముందు, ఆ తర్వాత కూడా పెట్రోల్ రేట్లు అధికంగా ఉన్న రాష్ట్రాలు.. ఏపీ, తెలంగాణలే.

పెట్రోల్ ధరలు అధికంగా ఉన్న టాప్ 5 నగరాలు:
హైదరాబాద్, విశాఖపట్నం రూ. 110.89 (ఒరూ. 3.39), తిరువనంతపురం రూ. 110.75 (ఒరూ. 3.37), కోల్‌కతా రూ. 108.74 (ఒరూ. 3.29), పాట్నా రూ. 108.55 (ఒరూ. 3.01), జైపూర్ రూ. 108.19 (ఒరూ. 3.16)గా నమోదయ్యాయి.

డీజిల్ ధరలు అధికంగా ఉన్న టాప్ 5 నగరాలు:
తిరువనంతపురం రూ. 99.63 (ఒరూ. 3.37), హైదరాబాద్ రూ. 98.96 (ఒరూ. 3.26), భువనేశ్వర్ రూ. 96.11 (ఒరూ. 3.56), చెన్నై రూ. 95.47 (ఒరూ. 3.08), కోల్‌కతా రూ. 95.13 (ఒరూ. 3.11)గా ఉన్నాయి. ధర పెంపు బేస్ స్థాయిలో రూ. 3గా ఉన్నప్పటికీ, స్థానిక పన్నుల కారణంగా పెట్రోల్ బంకుల వద్ద వాస్తవ ప్రభావం గణనీయంగా మారుతుంది. హైదరాబాద్, తిరువనంతపురంలో నివసించేవారు ఇప్పుడు దేశంలోనే అత్యధిక ధరలు చెల్లిస్తున్నారు. ఈ రెండు నగరాల్లోనూ పెట్రోల్ ధర రూ. 110 మార్కును అధిగమించింది. న్యూఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ. 97.77 ఉండగా, హైదరాబాద్‌లో రూ. 110.89గా ఉంది. ఈ రెండు మెట్రో నగరాల మధ్య ఇప్పుడు రూ. 13.12 తేడా స్పష్టంగా కనిపిస్తోంది. డీజిల్ ధరల్లో, తిరువనంతపురం రూ. 99.63తో అత్యంత ఖరీదైన నగరంగా అగ్రస్థానంలో నిలిచింది, రూ. 100 మార్కును దాదాపు తాకింది. హైదరాబాద్ రూ. 98.96తో తర్వాతి స్థానంలో ఉంది. అన్నింటికంటే తక్కువ ధరలతో చండీగఢ్ అత్యంత సరసమైన ప్రాంతాలలో ఒకటిగా మిగిలిపోయింది. అక్కడ పెట్రోల్ ధర రూ. 97.27, డీజిల్ ధర రూ. 85.25గా ఉన్నాయి. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధానంగా అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణ కారణమని




పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సంఘర్షణ ఫిబ్రవరి 28, 2026న మొదలైంది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైన ఉండటంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధరల సవరణకు ముందు రోజుకు దాదాపు రూ. 1,000 కోట్ల నష్టాలను చవిచూశాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్‌లో కొనసాగుతున్న సముద్ర దిగ్బంధనం ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన మార్గాన్ని అడ్డుకుంది. అండర్-రికవరీలు పెరుగుతున్నందున ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ధరల సర్దుబాటు మున్ముందు కూడా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

### తాగునీటి సమస్యలు తీర్చిన ...
# కంటే కేశవ గౌడ్
### కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు..




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :
అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని మందనపల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామస్తులు ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కంటే కేశవ గౌడ్ స్పందించి తక్షణమే ఆ గ్రామానికి వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. అర్ధరాత్రి గ్రామస్తులు ఆయనకు సమాచారం అందించడంతో హుటా హుటీనా ట్యాంకర్ ద్వారా తాగునీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని,




ప్రభుత్వం స్పందించి తాగునీటి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వేసవికాలంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉంటుందని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు...



ఉప్పల్ బి నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ మూడు నెలల పాటు నిర్మాణ పనులు....
హైదరాబాద్ పల్స్ న్యూస్ మే17, తెలంగాణ స్టేట్ బ్యూరో : ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల నేపథ్యంలో నేటి నుంచి ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. మూడు నెలల పాటు ఈ ఆంక్షలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. రామంతాపూర్, హబ్సిగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక నుంచి బీరప్పగడ్డ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది. నాగోల్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయాత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు లేదా సర్వీస్ రోడ్డు మార్గంగా ఘట్‌కేసర్ వద్ద జాతీయ రహదారిని చేరుకోవాలని సూచించారు. పీర్జాదిగూడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఉప్పల్ జంక్షన్‌కు ముందున్న లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా వెళ్లి ఉప్పల్ మెట్రో స్టేషన్ సమీపంలోని మాస్టర్ చెఫ్ రెస్టారెంట్ వద్ద యూ టర్న్ తీసుకుని ప్రయాణించాల్సి ఉంటుంది. పీర్జాదిగూడ నుంచి నాగోల్ వెళ్లే వాహనాలు ఉప్పల్ భాగాయత్ లేఔట్ మార్గాన్ని వినియోగించుకోవాలని, నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో వెళ్లాలని అధికారులు తెలిపారు. హబ్సిగూడ నుంచి నాగోల్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆంక్షలు లేవని స్పష్టం చేశారు.

# ఉత్తరాఖండ్ నేషనల్ పార్క్‌లో అద్భుతం.. అరుదైన కవల పిల్లలకు జన్మనిచ్చిన ఏనుగు


హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, సెంట్రల్ బ్యూరో: ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో ఓ అద్భుతమైన, అరుదైన వన్యప్రాణి దృశ్యం వెలుగుచూసింది. పార్క్‌లోని గార్జియా టూరిజం జోన్‌లో ఒక ఆడ ఏనుగు రెండు ఆరోగ్యకరమైన కవల పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఏనుగులు కవలలకు జన్మనివ్వడం చాలా అరుదు కావడంతో.. ఈ ఘటన వన్యప్రాణి నిపుణులు, అటవీ శాఖ అధికారులు, పర్యావరణ ప్రేమికులలో తీవ్ర ఆనందాన్ని నింపింది.

వెలుగులోకి వచ్చిందిలా..
ప్రముఖ వన్యప్రాణి ప్రేమికుడు సంజయ్ చిమ్వాల్ గార్జియా జోన్‌లో జంగిల్ సఫారీ చేస్తున్న సమయంలో ఈ తల్లి ఏనుగు, దాని కవల పిల్లలను గుర్తించారు. ఆ దృశ్యాలను ఆయన వీడియో తీయగా, ఆ ఫుటేజ్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ అరుదైన జననం కార్బెట్ రిజర్వ్‌లోని పర్యావరణ వ్యవస్థ ఎంత బలంగా, ఆరోగ్యంగా ఉందో తెలియజేస్తుందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఏనుగులు కవలలకు జన్మనివ్వడం అనేది అత్యంత అరుదైన విషయం. ఏనుగుల గర్భధారణలలో కేవలం 0.5 నుంచి 1 శాతం (1% కంటే తక్కువ) మాత్రమే ఇలా కవలలు పుట్టే అవకాశం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్బెట్ టైగర్ రిజర్వ్ డైరెక్టర్ డాక్టర్ సాకేత్ బదోలా మాట్లాడుతూ.. 'కార్బెట్ ల్యాండ్‌స్కేప్‌లో 1,200కు పైగా ఏనుగులు ఉన్నాయి. ఏనుగుల గర్భధారణ కాలం సుమారు 22 నుంచి 24 నెలల వరకు ఉంటుంది. ఇంత సుదీర్ఘ కాలం తర్వాత కవలలు పుట్టడం ఒక విశేషం. ఇది ఇక్కడి సురక్షితమైన, ఆరోగ్యకరమైన వన్యప్రాణి వాతావరణానికి సానుకూల సూచిక' అని హర్షం వ్యక్తం చేశారు.

తల్లి ఏనుగుకు సవాలే.. అటవీ శాఖ ప్రత్యేక పర్యవేక్షణ
వన్యప్రాణి నిపుణుడు, మాజీ అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ పాండే మాట్లాడుతూ.. 'అడవిలో కవలలు బతకడం అనేది ప్రధాన సవాలు. దీర్ఘకాలిక గర్భధారణ, ఆపై రెండు పిల్లలకు ఏకకాలంలో పాలు ఇవ్వడం అనేది తల్లి ఏనుగుపై తీవ్రమైన పోషకాహార భారాన్ని మోపుతుంది. దీన్ని తట్టుకుని పిల్లలను సాకడం సవాలుతో కూడుకున్నది' అని వివరించారు. కవల ఏనుగుల వార్త బయటకు రావడంతో గార్జియా జోన్‌లో పర్యాటకుల రద్దీ అమాంతం పెరిగింది. ఈ అరుదైన ఏనుగుల కుటుంబాన్ని చూసేందుకు సందర్శకులు సఫారీ బుకింగ్స్ కోసం ఎగబడుతున్నారు. అయితే, పర్యాటకుల తాకిడి వల్ల తల్లి ఏనుగుకు, దాని కవల పిల్లలకు ఎలాంటి ఇబ్బంది, అంతరాయం కలగకుండా అటవీ శాఖ అధికారులు పర్యవేక్షణను ముమ్మరం చేశారు. వాటికి తగినంత స్వేచ్ఛా స్థలం ఉండేలా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా, ఇంతకుముందు మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వ్‌లో కూడా ఇలాంటి కవల ఏనుగుల జననం నమోదైంది.



# ‘సైలెంట్ కిల్లర్’ను గుర్తిస్తున్నారా?





**పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా... ఈ రోజుల్లో అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) బారినపడుతున్నవారి సంఖ్య బాగా పెరుగుతోంది. ముఖ్యంగా 30-40 ఏళ్ల మధ్య వయస్కుల్లో ఈ సమస్య ఆందోళనకరంగా మారుతోంది. ఆధునిక జీవనశైలి కూడా ఇందుకు ఒక కారణం.**

**‘వరల్డ్ హైపర్ టెన్షన్ డే’ సందర్భంగా ఓ అవగాహన కోసం...**

అధిక రక్తపోటు సమస్య ఉన్నవారిలో సగం మందికి అసలు తమకీ సమస్య ఉందనే తెలియదు. 12.5 శాతం నుంచి 15 శాతం మంది మాత్రమే సరైన చికిత్స తీసుకుంటున్నారు. మనదేశంలో సుమారు 22 కోట్ల మంది ‘హైపర్‌టెన్షన్’తో బాధపడుతున్నారు. పట్టణాల్లో 33.8 శాతం, గ్రామాల్లో 27.6 శాతం. పెద్దవారిలో ప్రతీ నలుగురిలో ఒకరికి (25 శాతం నుంచి 28.5 శాతం) ఈ సమస్య ఉన్నట్లు అంచనా. మహిళల (21.2 శాతం) కన్నా పురుషుల్లో (24.1 శాతం) ఈ సమస్య కొంచెం ఎక్కువ. హైపర్ టెన్షన్ వల్ల తీవ్రమైన గుండెపోటు, కిడ్నీ సమస్యలూ వస్తాయి. మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం రావొచ్చు. కళ్లలోని రక్తనాళాలు దెబ్బతిని కంటిచూపు దెబ్బతినే ప్రమాదం ఉంది. అయితే చాలామందిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. అందుకే దీనిని ‘సైలెంట్ కిల్లర్’గా చెపుతుంటారు. హై బ్లడ్ ప్రెషర్, హైపర్ టెన్షన్.. రెండూ ఒకటే. వాడుక భాషలో ‘హై బీపీ’ అంటుంటారు. వైద్య పరిభాషలో ‘హైపర్ టెన్షన్’ అంటారు. రక్తనాళాల గోడలపై రక్తం చూపే ఒత్తిడి పెరగటం హై బీపీ. రక్తపోటు ఎక్కువగా ఉన్నపుడు డాక్టర్లు హైపర్ టెన్షన్ అంటారు. చాలామంది హైపర్ టెన్షన్ అంటే మానసిక ఒత్తిడి అని పొరబడుతుంటారు. మానసిక ఒత్తిడి వల్ల రక్తపోటు పెరగవచ్చు. కానీ హైపర్ టెన్షన్ అనేది శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థకు సంబంధించిన శారీరక సమస్య. సాధారణంగా రక్తపోటు 120/80 ఎంఎంహెచ్‌జీ ఉంటే ఆరోగ్యకరంగా ఉన్నట్టు లెక్క. 140/90 కన్నా నిరంతరం ఎక్కువగా



ఉంటే దాన్ని అధిక రక్తపోటుగా గుర్తిస్తారు. రక్తపోటు తీవ్రస్థాయికి పెరిగి నపుడు కనిపించే లక్షణాలు... తలనొప్పి, విపరీతమైన అలసట, కళ్లు తిరగడం, చూపు మందగించడం, నిద్రలేమి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, మెడనొప్పి, ఛాతీలో నొప్పి, గుండె దడ, తికమకపడటం, మతిమరుపు. హైపర్ టెన్షన్‌కు ముఖ్య కారణాలు– ఉప్పు అధిక వాడకం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, మానసిక ఒత్తిడి, ఆందోళన, మితిమీరిన మద్యసేవనం, ధూమపానం, స్లీప్ ఆప్నియా లాంటివి. ఈ సమస్య నియంత్రణకు మందులతో పాటు జీవనశైలి మార్పులు అవసరం. రోజుకు టీ స్పూన్ కన్నా తక్కువ ఉప్పు తీసుకోవాలి. కొవ్వు పదార్థాలు తగ్గించాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాల వాడకం పెంచాలి. రోజూ కనీసం అరగంట నడక, 7–8 గంటల నిద్ర అవసరం. అధిక రక్తపోటు కేసులను కనిష్ఠ స్థాయికి తగ్గించాలని కేంద్రప్రభుత్వం,



ఐసీఎంఆర్‌లు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందుకు ‘ఇండియా హైపర్ టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్’ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. 30 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారైనా రక్తపోటు పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ‘హైపర్‌టెన్షన్ డే’ థీమ్... ‘కంట్రోలింగ్ హైపర్‌టెన్షన్ టుగెదర్’. కావున అవగాహనతో దీనిని అదుపులో ఉంచుకునేందుకు అందరూ ప్రయత్నించాలి.

# చేనేత హక్కులు భవిష్యత్ కార్యాచరణ పై రౌండ్ టేబుల్ సమావేశం...







హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 17, తెలంగాణ స్టేట్ బ్యూరో : చేనేత హక్కులు – రాజ్యాధికారం -- భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక పై బేగంపేట హోటల్ మనోహర్ లో నిర్వహించిన ఈ యొక్క రౌండ్ టేబుల్ సమావేశం ఎర్ర మాధ వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ పద్మశాలి కమ్యూనిటీ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.... చేనేత రంగం మన సంస్కృతికి మాత్రమే కాదు, లక్షల కుటుంబాల జీవనాధారం కూడా. నేసే చేతులకు గౌరవం లభించినప్పుడే చేనేతకు నిజమైన జీవం వస్తుంది. కానీ నేటి పరిస్థితుల్లో చేనేత కార్మికులు రుణభారం, మార్కెటింగ్ సమస్యలు, తగిన ధరల లేమి, మధ్యవర్తుల దోపిడీతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చేనేత హక్కులు కేవలం సంక్షేమం కాదు అది మన జీవన గౌరవం. రాజ్యాధికారం అంటే పదవుల కోసం కాదు మన సమస్యలను మనమే పరిష్కరించే శక్తి..... చేనేత కులాలు, చేనేత కుటుంబాలు, చేనేత కార్మికులు రాజకీయంగా సంఘటితమైతేనే మన సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. మనం ఓటు బ్యాంకు కాకుండా నిర్ణయ శక్తిగా మారాలి. చేనేత రంగం బతకాలంటే, మనకు పాలనలో భాగస్వామ్యం, విధానాల్లో ప్రాధాన్యం, నిర్ణయాల్లో పాత్ర అవసరం. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక చేనేత కార్మికులందరినీ ఒకే వేదికపై సంఘటితం చేయాలి. రుణ మాఫీ, వడ్డీ భారం తగ్గింపు, తక్షణ ఉపశమనం కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం నిర్మించాలి. చేనేత వస్త్రాలకు మార్కెట్ హామీ, ప్రభుత్వ కొనుగోలు, నిల్వల సేకరణ కోసం ఒత్తిడి తేవాలి. చేనేత ఉత్పత్తులపై జీరో జీఎస్టీ కోసం కేంద్రంపై సమిష్టి డిమాండ్ చేయాలి. సహకార సంఘాలకు న్యాయమైన ఎన్నికలు, పారదర్శక పాలన సాధించాలి. చేనేత యువతకు ఉపాధి, శిక్షణ, డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వాన్ని పెంచి, రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలి. ఇట్టి సమావేశంలో పాల్గొన్న నేతలు విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, తెలంగాణ పద్మశాలి కమ్యూనిటీ చైర్మన్, గూడూరి శ్రీనివాస్, వీర వత్తిని అనిల్, ఎల్. రమణ, జక్కిడి అనిత పాల్గొన్నారు

# పిల్లలకు ప్రాసెస్ చేసిన ఆహారం ఎక్కువైతే ఆస్తమా ముప్పు!

**ఇంటర్నెట్ డెస్క్:** ఇటీవలి కాలంలో పిల్లలు.. చిప్స్, బర్గర్లు, ప్యాక్ చేసిన స్నాక్స్, ఇన్‌స్టంట్ నూడుల్స్ వంటి ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. అయితే ఈ అలవాటు పిల్లల ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాసెస్ చేసిన ఆహారాలు ఎక్కువగా తినడం వల్ల జీర్ణసమస్యలు వస్తాయని అంటున్నారు. అంతేకాకుండా ఆస్తమా వంటి శ్వాస సంబంధిత సమస్యలకు కూడా కారణమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ప్రాసెస్ చేసిన ఆహారం ఎందుకు ప్రమాదకరం?**

చిప్స్, పిజ్జా, బర్గర్లు, ఇన్‌స్టంట్ నూడుల్స్, చక్కెర ఎక్కువగా ఉండే ప్యాక్‌డ్ ఫుడ్స్ వంటి వాటిలో రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రంగులు ఎక్కువగా ఉంటాయి. ఇవి పిల్లల పేగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలాంటి ప్రాసెస్ చేసిన ఆహారం ఎక్కువగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రోగనిరోధక శక్తి తగ్గడం, శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరగడం, ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు రావచ్చు. అలాగే పిల్లల్లో ఆస్తమా వచ్చే ప్రమాదం కూడా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. పిల్లలు ఎంత ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారం తింటే, ఆరోగ్య సమస్యల ముప్పు అంత



ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు.

**పిల్లలకు ఏ ఆహారం మంచిది?**

పిల్లల ఆరోగ్యానికి ఈ ఆహారాలు మంచివని నిపుణులు సూచిస్తున్నారు:

తాజా పండ్లు, కూరగాయలు
ఇంట్లో తయారుచేసిన ఆహారం
పప్పులు, పాలు, ప్రోటీన్ పదార్థాలు
తక్కువ చక్కెర ఉన్న ఆహారం

పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తగ్గాలంటే ప్యాక్‌డ్, ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించి, సహజమైన ఆహారపు అలవాట్లు పెంచాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# వేసవిలో సోయాబీన్స్ ఆరోగ్య ప్రయోజనాలు..

**ఇంటర్నెట్ డెస్క్:** వేసవిలో శరీరాన్ని చల్లబరిచే, శక్తినిచ్చే ఆహార పదార్థాలను తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సోయాబీన్స్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రుచిగా లేకపోవడం, వగరుగా ఉండే సోయాబీన్స్‌ను తినడానికి చాలా మంది ఇష్టపడరు. అయితే మాంసాహారంతో సమానమైన పోషకాలు సోయా బీన్స్‌లో ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం కాపాడటంలో, బరువు తగ్గడానికి, కండరాల నిర్మాణంలో, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. వేసవిలో సోయాబీన్స్ తీసుకోవడం వల్ల కలిగే ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.

1. అలసటను తగ్గించి, తక్షణ శక్తిని ఇస్తుంది

ఎండల వల్ల వేసవిలో శరీరం త్వరగా అలసిపోతుంది. సోయాబీన్స్‌లో ఉండే అధిక ప్రొటీన్లు, ఐరన్ శరీరానికి అవసరమైన తక్షణ శక్తిని అందిస్తాయి. ఇది రోజంతా మిమ్మల్ని యాక్టివ్‌గా ఉంచడానికి సహాయపడుతుంది.

2. బరువు నియంత్రణ

వేసవిలో బరువు తగ్గాలనుకునే వారికి సోయాబీన్స్ ఒక అద్భుతమైన ఆహారం అనే చెప్పొచ్చు. ఇందులో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉండటం వల్ల.. దీనిని తిన్న తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఇది అతిగా తినడాన్ని నిరోధించి, బరువును అదుపులో ఉంచుతుంది.

3. గుండె ఆరోగ్యానికి మేలు

సోయాబీన్స్‌లో సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండి, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

4. చర్మ ఆరోగ్యానికి రక్షణ

ఎండ తీవ్రత వల్ల వేసవిలో చర్మం పొడిబారడం, ట్యాన్ అవ్వడం సర్వసాధారణం. సోయాబీన్స్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఇ చర్మాన్ని సూర్యుని అతినీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తుంది. ఇది చర్మంపై ముడతలను తగ్గించి, గ్లో పెరిగేలా చేస్తుంది.

5. జీర్ణక్రియ మెరుగుపడుతుంది

వేసవిలో జీర్ణవ్యవస్థ కాస్త మందగిస్తుంది. సోయాబీన్స్‌లో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఇది మలబద్ధకం సమస్యను నివారించి, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

6. ఎముకల బలం

సోయాబీన్స్‌లో కాల్షియం, మెగ్నీషియం, రాగి (క్రాపర్) వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ వచ్చే ఎముకల బలహీనతను (ఆస్టియోపోరోసిస్) అడ్డుకుని, ఎముకలను బలంగా ఉంచుతాయి.

7. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ

వేసవిలో చెమట రూపంలో శరీరం నుంచి పొటాషియం, సోడియం వంటి కీలక లవణాలు బయటకు పోతుంటాయి. సోయాబీన్స్‌లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటానికి, రక్తపోటును అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది.

8. మధుమేహం నియంత్రణ




మధుమేహం ఉన్నవారికి సోయాబీన్స్ ఒక సూపర్ ఫుడ్. దీని గ్లైసిమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. దీనివల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అకస్మాత్తుగా పెరగనివ్వదు. ఇందులో ఉండే ఐసోఫ్లేవోన్లు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి.

9. జుట్టు రాలడం తగ్గుతుంది

ఎండలు, చెమట, ధూళి వల్ల వేసవిలో జుట్టు బలహీనపడి రాలిపోతుంటుంది. సోయాబీన్స్‌లో ఉండే ప్రొటీన్లు, బయోటిన్, ఐరన్ జుట్టు కుదుళ్లను బలంగా ఉంచుతాయి. ఇది జుట్టుకు మంచి పోషణను అందించి, దృఢంగా పెరిగేలా చేస్తుంది.

10. మహిళల ఆరోగ్యానికి రక్షణ

ముఖ్యంగా మధ్యవయసు దాటిన మహిళల్లో (మేనోపాజ్ దశలో) వేసవి తీవ్రత వల్ల బాడీ హీట్, హఠాత్తుగా ఒళ్లు వేడెక్కడం వంటి సమస్యలు ఉంటాయి. సోయాబీన్స్‌లో ఉండే ఫైటోఈస్ట్రోజెన్లు శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడి, ఈ సమస్యల తీవ్రతను తగ్గిస్తాయి.

# ఆలు గడ్డలతో కరకరలాడే జంతికలు, ఫింగర్ చిప్స్

ఆలుగడ్డలు అంటే పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు. ఇక, వాటితో తయారు చేసే చిప్స్ అంటే తినకుండా ఉండలేరు. అలాంటి బంగాళాదుంపలతో జంతికలు, ఫింగర్ చిప్స్ ప్రిపేర్ చేస్తే అద్దిరిపోతాయి. మరి, వీటని ఎలా తయారు చేయాలి? ఇందుకోసం ఎలాంటి పదార్థాలు కావాలి? అన్నది ఇప్పుడు చూద్దాం.

**కావలసిని పదార్థాలు :**

బంగాళా దుంపలు - రెండు
బియ్యప్పిండి - రెండు కప్పులు
శనగపిండి - 1 కప్పు
కారం - 1 చెంచా
పసుపు - 1/4 చెంచా
జీలకర్ర - 1/2 చెంచా
వెన్న -1 చెంచా
ఉప్పు - తగినంత
నూనె - వేయించడానికి సరిపడా

**తయారీ విధానం :**

ముందుగా బంగాళాదుంపలను ఉడికించుకుకోవాలి క్లీన్ చేసుకున్న ఆలుగడ్డలను కుక్కర్‌లో వేసుకొని, తగినన్ని నీళ్లు పోసుకొని మూత పెట్టి రెండు మూడు విజిల్స్ పెట్టుకోవాలి.ఆ తర్వాత కుక్కర్లోని ఆవిరి మొత్తం పోయిన తర్వాత ఆలుగడ్డలను బయటకు తీసి, పైన పొట్టు తీసేసుకోవాలి.ఇప్పుడు ఒక మిక్సీ జార్ తీసుకొని, ఉడికించిన బంగాళాదుంపలు అందులో వేసుకోవాలి.అవసరాన్ని బట్టి అతికొద్దిగా నీళ్లు వేసుకొని మెత్తని పేస్ట్‌లాగా గ్రైండ్ చేసుకోవాలి. రెండు లేదా మూడు స్పూన్ల వాటర్ అయితే సరిపోతుంది. పేస్టు మరీ జారుగా అయ్యిందంటే జంతికలు చేయడం సాధ్యం కాదు.ఇప్పుడు ఒక తీసుకొని, అందులో శనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, జీలకర్ర, వెన్న వేసుకొని, అన్నీ కలిసిపోయేలా చక్కగా మిక్స్ చేసుకోవాలి.ఇప్పుడు అందులో ఆలుగడ్డ పేస్టు కూడా వేసుకొని కలుపుకోవాలి. కాస్త గట్టిగానే జంతికలకు అవసరమైన కన్సిస్టెన్సీలో పిండిని సిద్ధం చేసుకోవాలి.ఈ లోపు స్టౌ మీద కడాయి పెట్టి, డీప్ ఫ్రైకి సరిపడా ఆయిల్ వేసుకొని వేడెక్కనివ్వాలి.అనంతరం జంతికల గొట్టం తీసుకొని అందులో ఈ పిండి వేసుకొని వేసుకుని వేడి వేడిగా కాగుతున్న నూనెలో చక్రాల్లా ఒత్తుకోవాలి.వాటిని ఎర్రగా రెండు వైపులా వేయించుకుని తీసుకుంటే సరిపోతుంది. అద్దిరిపోయే జంతికలు కరకరలాడుతూ చాలా టేస్టీగా ఉంటాయి.

ఫింగర్ చిప్స్ తయారీ కోసం :

**కావలసిన పదార్థాలు :**

బంగాళాదుంపలు - అరకేజీ
అటుకులు - 1 కప్పు
రెడ్ చిల్లీఫ్లేక్స్ - 1 చెంచా
కొత్తిమీర తురుము - అరకప్పు
మయొనైజ్ - నాలుగు చెంచాలు
షెజ్వాన్ సాస్ - రెండు చెంచాలు
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - తగినంత

**తయారీ విధానం :**


ముందుగా ఒక మిక్సీ జార్ తీసుకొని, అందులో అటుకులు వేసుకుని మెత్తని పాడిలాగా గ్రైండ్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి.ఈ లోపు బంగాళాదుంపలను క్లీన్ చేసుకొని, కుక్కర్‌లో వేసి ఉడికించుకోవాలి.ఆ తర్వాత ఆలుగడ్డలు బయటకు తీసి, తడిలేకుండా చేసుకొని మిక్సీ జార్ లో వేసుకోవాలి. అదే మిక్సీ జార్‌లో కొత్తిమీర తురుము, చిల్లీఫ్లేక్స్ వేసి మెత్తగా మిక్సీ గ్రైండ్ చేసుకోవాలి.ఇప్పుడు ఈ పేస్టులో ఉప్పు, అటుకుల



పొడిని కొద్దికొద్దిగా వేసుకుంటూ చపాతీపిండి ముద్దలాగా తయారు చేసుకోవాలి.పిండిని కాస్త మందంగా చపాతీలాగా ఒత్తుకుని చాకుతో సన్నగా పొడవుగా ఉండేలా ఫ్రెంచ్‌ఫ్రైస్ షేప్? లో కట్ చేసుకోవాలి.ఈ లోగా స్టౌ మీద డీప్ ఫ్రైకి సరిపడా ఆయిల్ పెట్టి, వేడెక్కిన తర్వాత డీప్ ఫ్రై చేసుకుంటే సరి. కరకరలాడే పొటాటో ఫింగర్ చిప్స్ రెడీ అయిపోతాయి.ఆ తర్వాత షెజ్వాన్ సాస్, మయొనైజ్ రెండూ మిక్స్ చేసుకుంటే డిప్ చేసుకోవడానికి సాస్ రెడీ అయిపోతుంది.ఇప్పుడు ఫింగర్ చిప్స్‌ని సాస్ లోడిప్ చేసుకొని లాగిస్తుంటే ఎంతో టేస్టీగా ఉంటాయి

## ఏఐతో "మామిడి పండ్ల" సాగు
# ఎకరానికి 12 టన్నుల దిగుబడి!

మనకు ఏ సందేహం వచ్చినా గూగుల్ సెర్చ్ చేస్తాం. అయితే ఇప్పుడు ఆ రోజులు దూరమవుతున్నాయి. ఎందుకంటే అంతకు ఎన్నో రెట్లు మెరుగైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసింది. ఇది సమాచారాన్ని కావాల్సిన రీతిలో అందించడమే కాకుండా విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అనేక రకాల సేవలను అందిస్తూ మనిషి జీవితాన్ని సులభతరం చేస్తోంది. ఇప్పుడు ఆ ఏఐ సాయంతోనే టన్నుల కొద్ది మామిడి పండ్లను పండిస్తున్నాడు ఓ రైతు! మరి అదెంటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే.ఫలాల్లో రారాజుగా మామిడిని పిలుస్తారు. ఆ మామిడిలో రారాజు అల్ఫాన్సో. మన దగ్గర్నుంచి విదేశాలకి ఎక్కువగా ఎగుమతయ్యే రకం ఇదే! అయితే ఇది అన్నిచోట్లా పండదు. దానికి తగిన వాతావరణ పరిస్థితులు ఉండాలి. అయితేనేం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? సాయంతో దాన్ని పండిస్తున్నాడు సూరజ్ పాణిగ్రాహి అనే రైతు. ఈ మామిడి తోట పేరు మ్యాంగో మేజ్. ఏపీ హిందూపురానికి దగ్గర కర్ణాటక సరిహద్దుల్లోని తుమ్కూరు జిల్లాలో ఉంది. మొత్తం పదిహేను ఎకరాల్లో విస్తరించిన ఈ తోట ఓ స్టార్టప్‌లాంటిది.ఈ తోటకు ఆధునిక టెక్ స్టార్టప్‌లకి సీటీఓ(చీఫ్ టెక్నికల్ ఆఫీసర్)లు ఉన్నట్టే ఉన్నారు. ప్రశాంత్ అనే ఆ సీటీఓనే ఈ తోటలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? వ్యవహారాలన్నీ చూస్తారు! 15 ఎకరాల తోటకి సీటీఓలూ ఏఐలూ ఎందుకూ అనుకుంటున్నారు కదా? అక్కడే అసలైన విషయం ఉంది. సాధారణంగా ఏ మామిడి తోటలోనైనా సరే ఎకరానికి ఎక్కువలో ఎక్కువగా 80 మొక్కలే నాటతారు. కానీ మ్యాంగో మేజ్‌లో ఎకరానికి దాదాపు 1500 మొక్కలు పెంచుతున్నారు. ఇలా ఇక్కడ మొత్తం 25,000ల మొక్కలున్నాయి.క్వాంటమ్ డెన్సిటీ మ్యాంగో ఫార్మింగ్ : మొక్కకీ మొక్కకీ మధ్య 3 అడుగులు, మొక్కల వరసల మధ్య 7 అడుగులు మాత్రమే ఎడం ఉంచడంతోనే ఇది సాధ్యమైంది. దగ్గరదగ్గరగా ఇంత ఎక్కువగా మొక్కల్ని



పెంచడాన్ని క్వాంటమ్ డెన్సిటీ మ్యాంగో ఫార్మింగ్ అంటారు. మనదేశంలో ఈ విధానాన్ని తొలిసారి పరిచయం చేసింది ఈ తోటలోనే. మరోవైపు ఇంత దగ్గరగా మొక్కల్ని పెంచితే చీడపీడలు సోకే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అంతేకాక వీటికి అవసరమయ్యే పోషకాలను ఇవ్వడం కూడా ఇబ్బందే. పైగా వీళ్ల పండించేది అన్ని వాతావరణాలను తట్టుకోలేని అల్ఫాన్సో!అందుకే ఇక్కడే ఈ తోటకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? తోడ్పడుతోంది. అది ఎలాగంటే వ్యవసాయంలో డ్రోన్?లను ఉపయోగిస్తూ ఎరువులు చల్లడం, పురుగుమందులు పిచికారీ చేయడానికి వాడుతున్నారు. కానీ మ్యాంగో మేజ్‌లోని అత్యాధునిక ఏఐ డ్రోన్?లు అలాంటివేవీ చేయవు. ఇవి వారానికోసారి మొక్కమొక్కనీ స్కాన్ చేస్తూ ప్రతిదీ పరిశీలిస్తుంటాయి. ప్రతి మొక్క ఆరోగ్యాన్నీ, వాటికి కావాల్సిన నీటి శాతాన్నీ మైక్రో న్యూట్రియంట్‌నీ అంచనా వేస్తాయి.ఈ డ్రోన్‌లకి తోటలో ఉన్న సోలార్ మినీ వాతావరణ కేంద్రం కూడా సహాయపడుతుంది. అది రానున్న నాలుగైదు రోజుల్లో వాతావరణం ఎలా ఉంటుందో చూచాయగా ఓ అంచనానిస్తుంది. అటు డ్రోన్‌లూ, ఇటు మినీ వాతావరణ కేంద్రమూ. ఈ రెండు వ్యవస్థలూ తమ సమాచారాన్ని ఏఐ డ్యాష్‌బోర్డుకి సమాచారాన్ని అందిస్తాయి. దాన్నిబట్టి ఏ మొక్కకి ఎంతమేరకు నీరు కావాలో, ఎంత ఎరువు అవసరమో ఆ డ్యాష్‌బోర్డు నిర్ణయిస్తుంది.దీని సూచనల మేరకు ఐఓటీతో పనిచేసే డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ దానికదే మొక్కలకి నీటిని, పోషకాలను అందిస్తుంది. ఈ మొత్తం వ్యవస్థలో మానవప్రమేయం చాలా తక్కువ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? డ్యాష్‌బోర్డుని పర్యవేక్షించేవాళ్లూ, కొమ్మకత్తిరింపులకీ పండ్లకోతలకీ శ్రామికులూ ఉంటారు అంతే. అలా ఈ విధానంతో 70 శాతం సాగునీటిని ఆదా చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఎకరానికి మూడు టన్నులు అల్ఫాన్సోలు వస్తే ఈ పద్ధతిలో 12 టన్నులు వస్తున్నాయి. అంటే నాలుగురెట్లు ఎక్కువన్నమాట. క్వాంటమ్ డెన్సిటీ మ్యాంగో ఫార్మింగ్ అన్న ఈ సరికొత్త విధానంపైన చుట్టు ఉన్న అన్నదాతలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నాడు మ్యాంగో మేజ్ వ్యవస్థాపకుడు సూరజ్ పాణిగ్రాహి. సూరజ్ ఇవన్నీ చేయడం వెనక ఓ పెద్ద కథే ఉంది.యూరప్‌ని చూసి : సూరజ్ పాణిగ్రాహి ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి. బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్ అయిపోయాక నోకియా, విప్రో, మేక్ మై ట్రిప్ తదితర సంస్థల కోసం యూరప్‌లోని పలు దేశాల్లో సూరజ్ పనిచేశాడు. అప్పుడే అక్కడి భారీ ద్రాక్షతోటల్ని చూశాడట. క్వాంటమ్ డెన్సిటీ ఫార్మింగ్‌తోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?తో వాళ్లు సాధిస్తున్న దిగుబడుల్ని చూసి ఆశ్చర్యపోయాడట. ఆ ద్రాక్షలకన్నా మన అల్ఫాన్సో మామిడి పండ్లకు ఏం తక్కువ ఏఐతో మనమూ ఇదే స్థాయి నాణ్యతా దిగుబడీ సాధించొచ్చు కదా అని ఆయనకి అనిపించింది.దీంతో సూరజ్? ఉద్యోగానికి రాజీనామా చేసి భారత్‌కి వచ్చేశాడు. తుమ్కూరు దగ్గర 15 ఎకరాల పంట భూమిని కొని ఎన్నో ప్రయోగాలూ, మరెన్నో వైఫల్యాల తర్వాత 2021లో మ్యాంగో మేజ్ సృష్టించాడు. అన్నట్టు సూరజ్ తమ అల్ఫాన్సో మామిడిపళ్ల మార్కెటింగ్ కోసం సంవత్సరంలో ఎక్కువ కాలం బార్సిలోనాలోనే ఉంటాడు. ఆయనకు ఈ తోటకి సంబంధించిన రోజువారీ విషయాలపైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? ఏ పూటకాపూట సమాచారం ఇస్తూ ఉంటుందట.

# మస్కారాతో మతి పోగొట్టేలా..

కళ్ల అందాన్ని రెట్టింపు చేసే సౌందర్యసాధనం... మస్కారా! కానీ దీన్ని ఉపయోగించే సరైన విధానం గురించి అందరికీ తెలియకపోవచ్చు. మస్కారాతో మతిపోగొట్టడానికి అనుసరించాల్సిన చిట్కాలు కొన్ని ఉన్నాయి. అవేంటంటే....కనుబొమ్మలు ఒత్తుగా కనిపించడం కోసం, మస్కారా వాండ్‌ను కనురెప్పల చివర్ల నుంచీ అప్లై చేయడం మొదలుపెట్టి, చివరి వరకూ తీసుకురావాలి. కనురెప్పల వెంట్రుకల మధ్య తగినంత జాగా ఏర్పడి, చక్కని ఆకృతి సంతరించుకోవడం కోసం రెండు కోట్స్ వేసుకోవాలి. కనురెప్పల వెంట్రుకలు అతుక్కుపోకుండా, ముద్దగా మారిపోకుండా ఉండడం కోసం, అప్లికేషన్‌కు ముందు వాండ్‌కు అంటుకున్న అదనపు మస్కారాను తొలగించాలి. అలాగే..వాండ్ మొన సహాయంతో ఒక్కో ల్యాష్‌కూ మస్కారా అప్లై చేయాలి. ప్రత్యేకించి కింది కనురెప్ప వెంట్రుకలు, లోపలి మూలల మీద దృష్టి పెట్టాలి.మొదటి కోట్ పూర్తిగా ఆరిపోయిన తర్వాతే రెండో కోట్ వేసుకోవాలి.వాండ్‌ను టిష్యూకు అద్ది అదనపు మస్కారాను తొలగించి, ఆ తర్వాతే అప్లై చేసుకోవాలి.కనురెప్పలు రెట్టింపు ఒత్తుగా కనిపించడం కోసం, కనురెప్పల అడుగు నుంచి పైనుంచి మస్కారా అప్లై చేసుకోవాలి.మస్కారా వేసుకోడానికంటే ముందు కనురెప్పలను కర్ల్ చేసుకోవాలి.ఒత్తుగా కనిపించడం కోసం, కనురెప్పలకు ల్యాష్ ప్రైమర్‌ను అప్లై చేయాలి.మస్కారా అప్లై చేసిన తర్వాత, కనురెప్పలు అంటుకుపోకుండా, వెంట్రుకలు విడివిడిగా కనిపించడం కోసం, స్పూలీని ఉపయోగించి దువ్వాలి.మస్కారా ఎండిపోయినట్టు కనిపిస్తే, ఆ బాటిల్‌ను వేడి నీళ్లలో ఉంచాలి.కళ్ల ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా ఉండాలంటే, మస్కారాను ప్రతి మూడు నెలలకూ మారుస్తూ ఉండాలి.



## "రెస్టారెంట్ స్టైల్ బోన్ లెస్
# చికెన్ మసాలా"

చూస్తేనే నోరూరిపోతుంది!



రెస్టారెంట్ లో చికెన్ కర్రీ చాలా టేస్టీగా ఉంటుంది. ముక్క జ్యూసీగా, తిన్నా కొద్దీ తినాలనిపిస్తుంది. రెస్టారెంట్ లో రెడీ మేడ్ గ్రేవీ ఉంటుంది. చికెన్ ఫ్రై చేసి గ్రేవీతో కలిపి హై ఫ్లేమ్ లో కుక్ చేసి ఇస్తుంటారు. కానీ, ఇంట్లో అలా కాకుండా ఇలా చేశారంటే కర్రీ అద్దిరిపోతుంది.

**కావల్సిన పదార్థాలు :**

చికెన్ - 750 గ్రాములు
టమోటాలు - 3
పచ్చిమిర్చి - 6
జీడిపప్పు - 12
నూనె - 4 టేబుల్ స్పూన్లు
జీలకర్ర - అర స్పూన్
యాలకులు - 3
లవంగాలు - 3
బిర్యానీ ఆకు - 1
దాల్చినచెక్క - 1 ఇంచు
ఉల్లిపాయ - 1 పెద్దది
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1.5 టేబుల్ స్పూన్
పసుపు - అర స్పూన్
ఉప్పు - రుచికి సరిపడా
గరం మసాలా - అర స్పూన్
కారం - 2 స్పూన్లు
ధనియాల పొడి - 1 టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి - 1 టేబుల్ స్పూన్
కశ్మీరీ చిల్లి పౌడర్ - అర స్పూన్
కొత్తిమీర - చిన్న కట్ట

**తయారీ విధానం :**

ముందుగా చికెన్‌లో ఉప్పు, పసుపు కలిపి క్లీన్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇపుడు మిక్సీ జార్ లోకి పండు టమోటా ముక్కలు వేసుకుని పచ్చిమిర్చి, జీడిపప్పు వేసుకుని మెత్తని పేస్ట్ మాదిరిగా గ్రైండ్ చేసుకోవాలి.ఆ తర్వాత స్టవ్ పై కడాయి పెట్టుకుని నూనె వేసుకోవాలి. అందులో జీలకర్ర, యాలకులు, లవంగాలు, బిర్యానీ ఆకు, దాల్చినచెక్క వేసుకుని వేయించాలి. ఆ తర్వాత సన్నగా కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు వేసుకుని దోరగా వేయించాలి. ఉల్లిపాయలు సగం వరకు వేగిన తర్వాత పచ్చిమిర్చి సన్నగా కట్ చేసి వేసుకుని కలపాలి.ఇపుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ కలిపి రంగు మారే వరకు వేయించాలి. ఆ తర్వాత శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలు వేసుకుని హై ఫ్లేమ్‌లో మూడు, నాలుగు నిమిషాల పాటు బాగా వేయించాలి.ఆ తర్వాత పసుపు ఉప్పు, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసుకోవాలి. రంగు కోసం కొద్దిగా కశ్మీరీ చిల్లీ పౌడర్ వేసుకుని కలపాలి. ఇపుడు మీడియం ఫ్లేమ్ లో 10 నిమిషాల పాటు మూతపెట్టుకుని మధ్య మధ్యలో అడుగు పట్టకుండా కలుపుతూ ఉడికించాలి.ఆ తర్వాత మూత తీసుకుని ముందుగా గ్రైండ్ చేసుకున్న టమోటా ప్యూరీ కూడా వేసుకుని కలపాలి. మీడియం ఫ్లేమ్ లో మరో ఐదు నిమిషాలు ఉడికించి గ్రేవీకి సరిపడా నీళ్లు పోసి కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి.ఆ తర్వాత మూత తీసేసి కొద్దిగా కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులు వేసుకోవాలి. అంతే! ఘుమఘుమలాడే రెస్టారెంట్ స్టైల్ చికెన్ కర్రీ రెడీగా ఉంటుంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.